# లైఫ్ ఇన్ ఎ కాలేజ్

నేను కాలేజి స్టూడెంటును.

నేను కాలేజి స్టూడెంట్‌నని చెప్పుకోవడం నాకు చాల సరదా. నేనంటే మా కాలేజీలో మిగతా స్టూడెంట్స్‌కు లెక్చరర్స్‌కు హడల్. అంటే అర్థమయ్యే వుంటుంది. నేనొక పెద్ద రౌడీనన్న అభిప్రాయం వాళ్ళల్లో స్థిరపడిపోయింది. నన్ను మొట్టమొదట 'రౌడీ' అని అన్నవా డెవడో గాని వాడికి నా జన్మంతా ఋణపడి వుంటాను. ఎందుకంటే నేను రౌడీగా పేరు తెచ్చుకోవాలని, నన్ను చూస్తే నా చుట్టూవున్న జనమంతా హడలి చావాలని నాకో బ్రహ్మాండమైన కోరికవుంది. అసలు నాకీ కోరిక ఎలా కల్గిందో చెప్తాను.

నేను హైస్కూల్లో చదివే రోజుల్లో రమేష్ అనే వాడొకడుండే వాడు. ఎక్కుపెట్టిన మీసాలు, కండలు తిరిగిన శరీరం, ఆరడుగుల ఎత్తు, వాడు నడుస్తుంటే భూమంతా అదురుతుండేది. వాడ్నిచూస్తే పిట్టలు నీళ్లు త్రాగవని, పసిపిల్లలకు ఝడుపు జ్వరం పట్టుకుంటుందని మా స్కూల్లో అంతా చెప్పుకునేవాళ్ళు. ఇక మా స్కూలు టీచర్స్, హెడ్‌మాస్టర్ మాట వేరే చెప్పాలా! రమేష్‌ను చూస్తే వాళ్ళ పై ప్రాణాలు పైనే పోయేవి. టీచర్స్ రమేష్‌కు నమస్కారాలు పెట్టడం చూశాను నేను. రమేష్ వరుసగా మూడుసార్లు ఆ స్కూలు ప్రెసిడెంట్‌గా ఎన్ని కయ్యాడు. మా స్కూలు హెడ్‌మాస్టర్ రమేష్ ఎంతంటే అంత. ఒక్కరోజయినా క్లాసుకు వచ్చిన పాపాన పోలేదు రమేష్. అయినా రమేష్‌కు 90 శాతం అటెండెన్స్ దొరికింది. 12 వ తరగతిలో 50 శాతం మార్కులతో పాసయ్యాడు.

రమేష్‌ను ఎప్పుడు చూసినా నేను సంభ్రమాశ్చర్యాలతో ఊగి పోతుండే వాడిని. రమేష్ పట్ల నాలో యెనలేని గౌరవాభిమానాలు పాదుకున్నాయి. అతడు నా అరాధ్యదైవం అయిపోయాడు. అతని రూపం, అతని నడక, అతని మాటతీరు, అతని మీసాలతీరు, అతనిలోని నిర్లక్ష్యం, అతని వివిధ చేష్టలు అన్నీ నాకు తెలియకుండానే నేను అనుకరించటం మొదలెట్టాను. రమేష్‌ను, అందరూ అన్నట్టే నన్నూ ఎవరైనా రౌడీ అంటేవినాలని ఎంతో సరదాపడేవాడిని. కాని హైస్కూల్లో వుండగా అది సాధ్యంకాలేదు. మనసులో ఎంత వున్నా, రమేష్‌ను నిజంగా అనుకరించే సాహసం అప్పుడు నాలో కలుగలేదు. పైగా రమేష్‌కున్న యెక్కుపెట్టిన మీసాలు, మంచి కండపుష్టి హైస్కూల్లో వుండగా నాకు లేకపోయాయి. ఒకసారి మా తెలుగు మాస్టారు అన్నట్లు ఉత్త అర్భకుడిలా కన్పించేవాడిని అప్పుడు.

## 2

నేను కాలేజీలో బి. ఏ. చదువుతున్నాను. నేను బి. ఏ. చదవటం మా నాన్నకు బొత్తిగా యిష్టంలేదు. నన్ను యం. బి. బి. యస్. చది వించాలని ఆయన కలలు గన్నాడు. మా నాన్న బాగా డబ్బున్నవాడే. నన్ను ఎలాగో యం.బి.బి.యస్. లో చేర్పిస్తే చాలు- ప్యాసయ్యే మాట దేవుడెరుగు. కనీసం ఏభై వేలన్నా కట్నం కురుస్తుందని మా నాన్న ఎంతగానో ఆశించాడు. అందుకే హైస్కూల్లో వుండగా నాకు ట్యూషన్స్ చెప్పించాడు. ట్యూషన్స్ అంటే టీచర్స్‌కు తృణమో పణమో యిచ్చి రికార్డు మార్కులు ఎక్కువ వేయించు కోవట మన్నమాట. పరీక్షలకి ముందు నన్ను రాత్రింబవళ్ళు బాగా చదివించాడు. చదువుతున్నట్లు నటించి ఆయన నిద్రపోగానే నేను సెకండ్ షోకి ఉడాయించేవాడిని. ఒకరోజు నేను చదువు వదిలేసి సెకండ్‌షోకి వెళ్ళినట్లు మా నాన్న తెలిసికున్నాడు. ఆ తెల్లవారి బాగా తన్నాడు. ఆదెబ్బలూ ఇప్పటికీ జ్ఞాపకంనాకు. అడ్డమొచ్చిన అమ్మనుకూడా రెండు వేశాడు. నా దెబ్బలు చూసి మా అమ్మగుండెలు చెరువయ్యాయి.

పాపం - రెండురోజుల వరకు యేడుస్తూనే వుంది అమ్మ. ఆనాడు మా నాన్న నన్ను పశువును బాదినట్లు బాదిననాడే నిర్ణయించుకున్నాను. ఈయన కోరిక ప్రకారం యం. బి. బి. యస్. నన్ను చంపినా సరే చదవనని. ఆ నాటి నుండి మా నాన్న అన్నా, యం. బి. బి. యస్. అన్నా విపరీతమైన ద్వేషం కల్గించింది నాలో.

సరే. మా నాన్న చేసే ప్రయత్నాలు మా నాన్న చేస్తాడు. మా హెడ్ మాస్టర్‌ను కలుసుకున్నాడు. టీచర్స్‌కు తృణమో పణమో యిస్తున్నాడని ఇదివరకే చెప్పానుగా! నేను బాగా చదివిన ప్రశ్నలు రాకపోతే కాపీ చెయ్యమన్నాడు. నన్నెవరూ పట్టుకోరని, అన్ని గుండెలు మా టీచర్స్‌లో ఎవరికీ లేవని మా నాన్న (బ్లాకుకు ప్రసిడెంటు) చెప్పాడు. ఫలానా ప్యూనుతో క్వశ్చన్ పేపర్ బయటకు పంపించమని ఆ ప్యూన్ ఆన్సర్ పట్టుకొస్తాడనికూడా చెప్పాడు. నిజం చెప్పొద్దు, నన్ను యం. బి. బి. యస్. లో చేర్పించాలని మా నాన్న యిలా గడ్డి కరవటం చూస్తే మా నాన్న మీద నా కున్న ద్వేషం యింకా ఎక్కువైంది.

అనుకున్నట్లుగానే నేను ప్యూన్‌తో క్వశ్చన్ పేపర్ బయటకు పంపించటం, ఇన్విజిలేటర్‌గా వచ్చిన టీచర్ చూస్తూనే వున్నాడు. అయినా కిమ్మనలేదు. ఆ ప్యూనే బయట నుండి ఆన్సర్స్ తెచ్చాడు. మా నాన్న ఆ ఆన్సర్స్‌ని బయట ఒక టీచర్ చేత రాయించి పంపించాడు. ఇలాగే పరీక్షలన్నీ రాసేశాను. నా చుట్టుపక్కలున్న కొందరు మిత్రులకి కూడా ఆ ఆన్సర్స్ అందజేశాను, వాళ్ళ గోల భరించలేక. వాళ్ళందరూ నాతోపాటు ఇప్పుడు కాలేజీలో చేరారు. నా కారణంగా 12 వ తరగతి ప్యాసుకాగల్గామని, నాకు సదా ఋణపడి వుంటామని వాళ్ళు నాకు పదే పదే చెప్తుంటారు. ఏమైనా వాళ్ళంతా ఎప్పుడూ నా చుట్టూ తిరగటం నా మాటను గౌరవించటం, నన్ను హీరోగా చూడటం నా కెంతో ఆనందాన్ని కల్గించింది.

ఇలా పరీక్షల్లో నాతో కాపీ చేయించడంతో తృప్తి పడక మా నాన్న నా ఆన్సర్ పేపర్స్ ఎవళ్ళ దగ్గర కెడ్తున్నాయో తెలిసికొని, వాళ్ళ దగ్గరకుకూడా వెళ్ళొచ్చాడు. నాకు తప్పకుండా 70 శాతం పైనే

మార్కులు వస్తాయని, యం. బి. బి. ఎస్. లో సీటు తప్పకుండా దొరుకుతుందని నాకు యాభై వేల వరకు కట్నం వస్తుందని మా నాన్న తెగ మురిసి పోయాడు. నేను మాత్రం యం. బి. బి. యస్. లో సీటు దొరక్కపోతే తిరుపతికి వెళ్ళి గుండు చేయించుకుంటానని మొక్కాను.

ఏడు కొండలవాడు నన్ను కరుణించాడు. నేను 52 శాతం మార్కులతో భేషుగా సెకండ్‌క్లాసులో పాసయ్యాను. మా నాన్న ఉగ్రుడై పోయాడు. చేసిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరయిందని వాపోయాడు. ఫలానా ఎగ్జామినర్ గాడు మోసం చేశాడని, వాడి దొక్కలో నిద్రపోతానని హుంకరించాడు. ఉత్త పనికిరాని వెధవ అని నన్ను బూతులు తిట్టాడు. ఆ తర్వాత మా అమ్మను పట్టుకొని చెడామడా తిట్టాడు. మా నాన్న దగ్గర ఒకపాడు అలవాటుంది. నేను యేదైనా తప్పుచేసినా, ఆయన కోరినట్లుగా ప్రవర్తించక పోయినా మా నాన్న మా అమ్మను పట్టుకొని బూతులుతిడ్తాడు. ఆయనకు నేను కొడుకునుకాదన్నట్లు అమ్మతో, "నీ సుపుత్రుడు" "నీ సుపుత్రుడు ఉత్త ఊంత, చవట" అంటూ పళ్ళు కొరుకుతాడు. మా అమ్మను మానాన్న అలా బూతులు తిడ్తుంటే నారక్తం ఉప్పొంగి పోయేది. ఎప్పుడో ఒకసారి మా నాన్న తల పగుల గొట్టాలని నిశ్చయించుకున్నాను.

# 3

వేరే చెప్పాలా! నాకు యం. బి. బి. యస్. లో సీటు దొరకలేదు. అప్పటికీ మా నాన్న ప్రయత్నాలు మానుకోలేదు. మినిస్టర్స్‌తో సిఫారసులు తెచ్చాడు. మాది బ్యాక్‌వర్డు క్లాసన్నాడు. మాది షెడ్యూలు కాస్టు అని ఒక సర్టిఫికెట్ సంపాదించాలన్న ఐడియా కూడా మా నాన్నకు రాకపోలేదు. కాని ప్రిస్టేజి అడ్డం వచ్చిఊరుకున్నాడు.

నాకు యం. బి. బియస్.లో సీటు దొరక్కపోవటం నాతోపాటు మా అమ్మనుకూడా సంతోషపరచింది. ఎందుకో తెలుసా ? మా అమ్మకో తమ్ముడున్నాడు. ఆ తమ్ముడికో కూతురుంది. ఆ కూతురు నాకు మరదలౌతుందని ఈపాటికి తెలిసే వుంటుంది. ఆ పిల్లను నాకిచ్చి పెళ్ళి

చేస్తే తన జన్మ ధన్యమౌతుందని మా అమ్మ చాలాకాలంగా కలలు కంటోంది. నేను యం.బి.బియస్.లో చేరితే అమె కలలన్నీ కరిగిపోతాయి. ఎందుకంటే నేను యం. బి. బి. యస్.లో చేరటంతోనే నా రేటు ఝుమ్మని ఆకాశానికి ఎగిరిపోతుంది. ఏభై వేలకు తక్కువైతే, మా నాన్న ససేమిరా ఒప్పుకోడు. పాపం, మామయ్య ఐదువేలకంటే ఎక్కువ యిచ్చుకోలేడు. ఇందువల్ల నేను బి. ఏ. లో చేరటంతో మా అమ్మ గుండెలు కుదుట పడ్డాయి.

కాని మా అమ్మ కోరిక ప్రకారం మామయ్య కూతురుని చేసుకోవటం మా నాన్నకుగాని, నాకుగాని బొత్తిగా యిష్టంలేదు. ఈ ఒక్క విషయంలోనే నేను మా నాన్నతో ఏకీభవించాను. మా నాన్నకు యిష్టం లేకపోవటానికి కారణం కట్నమే. మామయ్యను కోసినాసరే ఐదువేల కంటే ఎక్కువ యివ్వడు. తనకే రెండువేలు యిస్తామని వెయ్యితో సరిపుచ్చాడట. ఆ విషయం జ్ఞాపకం చేసి, యిప్పటికీ మా అమ్మని దెప్పి పొడుస్తుంటాడు నాన్న. తనకే పెద్ద అన్యాయం జరిగిపోయింది. ఆ అన్యాయం నాకు జరగకూడదంటాడు.

మామయ్య బిడ్డను-అంటే సరళను చేసుకోవటం నాకెందుకు యిష్టంలేదో చెప్పమంటారా? కట్నం గిట్నం మనకు పెద్దగా పట్టదు. కాని పెద్ద చిక్కేమిటంటే సరళ అచ్చం కోతిలా వుంటుంది. అందంగా లేకుంటే మానె, అందవికారంగా లేకున్నా బావుండును. సరళ నాకు మరదలు కాబట్టి సినిమాలో హీరో హీరోయిన్ లాగ చెట్టాపట్టాలేసుకొని డ్యూయట్లు పాడుకుంటూ సరళతో తిరగాలనిపిస్తుంది. కాని సరళ నన్ను "బావా" అని పిలిచినప్పుడల్లా సరళ మొహంలో నాకు కోతులు కొండ ముచ్చులు కన్పిస్తాయి.

సరళ కోతిలాగా వుండటం కూడా నాకు పెద్ద సమస్య అయి కూర్చున్నది. సరళ నాదగ్గరకొచ్చి-

"బావా ! నన్నే పెళ్ళిచేసుకుంటావు గదూ?" అంటూ పళ్ళికిలిస్తుంది. నేను చిరాకుగా "ఈ కోతినా?" అంటాను.

"అత్తయ్యా! బావ నన్ను కోతి అన్నాడే! అమ్మా బావ నన్ను కోతి అన్నాడే!" అని చెప్పుకుంటుంది. మాఅమ్మ, అత్తయ్య ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ-

"బావ సరస మాడుతున్నాడు లేవమ్మా. అప్పుడే ఎంచక్కా చిలకా గోరింకల్లాగ కలకల్లాడుతున్నారు చూడు!" అంటూ అరమోడ్పు కనులతో పరవశించిపోతుంది మా అమ్మ.

"ఇక నేను ఏ గోతిలో పడాలో చెప్పండి?"

## 4

"ఎం.బి.బి.యస్.లో సీటు దొరకలేదు కదా, బి.యస్‌సి. ఏడ్వు" అన్నాడు నాన్న. బి.యస్‌సి.లోనే ఏడుద్దామనుకున్నాను. బి.యస్‌సి. క్లాసు నాకు బొత్తిగా నచ్చలేదు. హైస్కూల్లోని నా ఫ్రెండ్సంతా బి.యే. ల్లోనే చేరారు. (నేను వాళ్ళకి ఆన్సర్స్ అందించిన అభిమానంతో నన్ను హీరోలా చూస్తున్నారని ఇదివరకే చెప్పాను.) బి. ఏ.లో మరొక పెద్ద ఆకర్షణ వుంది. కనీసం ఓ అయిదారుగురయినా అప్సరస ల్లాంటి అమ్మాయిలు బి. ఏ.లో వున్నారు. అందులో సువర్చల అనే అమ్మాయి మరీ యిదిగా - అంటే ఒక్కసారి చూస్తేచాలు. ఇక ఆ రాత్రంతా నిద్రపట్టనంత యిదిగావుంది. కోతిమొహాప్ప సరళతప్ప అందమయిన ఆడదాని మొహం ఎరుగని నాకు సువర్చల మొహం చూడటం బోలెడు ఆనందాన్ని యిచ్చేది. సువర్చల విషయం తర్వాత చెబుతాను. ఈ కారణాలవల్ల మొదట్లో బి. యస్‌సి.లో చేరినా ఒక ఫైన్ మార్నింగ్ బి.ఏ.లోకి మారాను.

మొదట్లో కాలేజి కొత్తగా, సరదాగా అత్తవారిల్లులాగ అనిపించేది. క్లాసుకు వెళ్ళినా, వెళ్ళకపోయినా, పాఠాలు చదివినా, చదవకపోయినా అడిగేవాడు లేడు. హైస్కూలులో వుండగా హోంవర్కు, నెలపరీక్షలు, రికార్డు బుక్స్ మొదలయిన వెధవ పనులన్నీ చేయాల్సి వచ్చేది. కాలేజీలో యివేవీ లేకపోవటం ఎంత హాయిగా వుందో చెప్పలేను. కాలేజీకి పుస్తకాలు తీసికొని పోవాల్సిన అవసరంకూడా లేదు. స్టయి

లిష్‌గా చేతిలో ఒక నోట్‌బుక్, నీట్‌గా వైట్ పాంట్ వేసి వైట్‌షర్టులో టకప్‌చేసి, పాయింటెడ్ షూస్‌లో వరండాలో టకటక మనిపించుకుంటూ, మీసాలను పదేపదే మెలిపెడుతూ (కాలేజీలో చేరేనాటికి నాకు మా హైస్కూలు గురువు రమేష్ లాంటి మీసాలు, మంచి పుష్టి వచ్చేసాయి) ఆడపిల్లలకేసి చూపులు విసురుతూ, కాలేజీలో తిరగడం ఎంత హాయిగా వుంటుందనుకున్నారు. అనుభవించాల్సిందే మాటలతో చెప్పలేం.

ఇలా కాలేజీలో చాలాకాలం వరండాల్లో తిరగడానికే గడిపినా అప్పుడప్పుడు సరదాగా క్లాసుకి కూడా వెళ్తుండేవాళ్ళం.

# 5

ఇక మా క్లాసుకొచ్చే లెక్చరర్స్‌గూర్చి చెప్పొద్దా! మాకు ఇంగ్లీషుచెప్పే లెక్చరర్ ఎప్పుడూ హడావుడిగా పుల్‌సూట్‌లో, చెమటలు కార్చుకుంటూ పదినిమిషాలు లేటుగా, ఫైరింజన్‌లా క్లాసులోకి దూసుకు వచ్చేవాడు. క్లాసులోకి రాగానే, విసుగ్గా, చిరాగ్గా, "నోఫాన్స్—మోస్ట్ హారిబుల్ క్లాసురూమ్స్" అని తిట్టుకుంటూ కోటువిడచి కుర్చీమీద పడేసేవాడు. తర్వాత జేబులోంచి దస్తీతీసి మొహమంతా తుడుచుకునేవాడు "నో ఫాన్స్—హారిబుల్ క్లాసురూమ్స్" అని మళ్లా అనుకుంటూ పై సర్దుకునేవాడు. ఈయనకు పై సర్దుకోవడం బాగా అలవాటు. ఒకరోజు క్లాసు పూర్తయ్యేలోగా ఈయన ఎన్నిసార్లు పై సర్దుకుంటాడో లెక్కవేశాము. 210 సార్లు పై సర్దుకున్నాడు. కోటు విడవటం, చెమట తుడుచుకోవటం, పై సర్దుకోవటం ఇన్‌షర్టు సరిచేసికోవటం, తర్వాత నెమ్మదిగా అటెండెన్స్ తీసికోవటం- (మా క్లాసు సంఖ్య 70) - ఈ తతంగమంతా పూర్తయ్యే టప్పటికి పది నిమిషాలు పట్టేది. ఆ తర్వాత మనదేశంలో కాలేజీలు ఎంత అధ్వాన్నంగా వున్నాయో, కనీసం ప్రతిరూమ్‌కు ఫ్యాన్స్ ఐనా లేకపోవటం ఎంత ఘోరమైన విషయమో ఫారెన్ యూనివర్సిటీల్లోనైతే క్లాస్‌రూమ్స్

ఎయిర్ కండిషన్స్ చేయబడి, ఎంతహాయిగా వుంటాయో! అలా ఎయిర్ కండిషన్ చేయబడిన రూమ్స్‌లోనైతే తను ఎంత బ్రహ్మాండంగా పాఠం చెప్పగలడో—యిలా హస్క్ దంచేవాడు. ఈ హస్క్ కొత్తలో మాకు సరదాగానే ఉండేది. కాని పోను పోను బోరుకొట్టటం మొదలెట్టింది. కొన్ని రోజుల తర్వాత ఆయన క్లాసులో అడుగుపెట్టగానే మేమే "హా!—ఫ్యాన్స్ అయిన లేని హారిబుల్ క్లాస్‌రూమ్స్—హారిబుల్ క్లాస్ రూమ్స్—ఎయిర్ కండిషన్స్ రూమ్‌లోనైతే—" అంటూ గోలచేసే వాళ్ళం. మా మిత్రులంతా గొల్లున నవ్వేవాళ్లు. మా ఇంగ్లీషు లెక్చరర్ అప్పుడు డిసిప్లిన్‌ను గురించి ఫారన్ యూనివర్సిటీల్లోనైతే స్టూడెంట్స్ ఎంత డిసిప్లిన్‌గా వుంటారో' అందుకే వాళ్లు ఎంత పైకి వస్తున్నారో మేము ఎంత కిందికి దిగజారిపోతున్నామో—ఇలా గంటసేపు బోరుకొట్టే వాడు. ఇలా మా ఇంగ్లీషు లెక్చరర్‌గారు ఆరునెల్లు చెప్పినా మూడు పాఠాలయినా పూర్తికాలేదు.

ఇక మా తెలుగు మాష్టారు - తెలుగు మాష్టారంటే నాకేకాదు- మా క్లాసంతటికి చాలా యిష్టం. ఎందుకంటే రోజూ మంచి బూతు పద్యాలు శ్రావ్యంగా చదివి వాటి టీకా తాత్పర్యాలు ఎంతో చక్కగా వివరించి చెప్పేవాడు. తెలుగు పద్యాల్లో యింత బూతు వుందని తెలిస్తే మదన, మన్మథలాంటి పత్రికలు కొని చదివేవాళ్ళం కాదు కదా అనుకున్నాము మా మిత్ర బృందమంతా.

తెలుగు మాష్టారు గొంతెత్తి బూతుపద్యాలు అతిశ్రావ్యంగా పాడటం. ఆ తర్వాత వాటి తాత్పర్యాలు చెప్పటం క్లాసునంతా గొల్లున నవ్వించడం ఆడపిల్లల మొహాలు కందగడ్డలా మారటం, అది మమ్మల్నియింకా ఎంకరేజ్ చేయటం. మేము లేచి బెంచీల మీద ట్విస్టు డ్యాన్సులు కథాకళి నృత్యం చేయటం-ఓ-తెలుగు క్లాసంటే, కొత్త సినిమా విడుదలయిన రోజు సినిమాహాలులో లాగా భలే జోరుగా, సరదాగా వుంటుందిలెండి.

అయితే మా తెలుగు మాస్టారుకు తెలుగు రాదనుకునేరు, ఆయన మహాపండితులట. ఆయన పాండిత్యానికి మేము అనర్హులమట. "అయినా తెలుగు చెప్పేదేమిట్రా? తెలుగులో ఫెయిలయ్యే వెధవ ఎవడన్నా వుంటాడా?" అనేవారు మా తెలుగు మాస్టారు.

ఇక మా ఎకనామిక్స్ లెక్చరర్ - బెల్‌కాక పూర్వమే క్లాసులో కొచ్చి కూర్చునేవాడు ఎప్పుడూ ఆముదం తాగిన మొహం. జన్మలో ఎప్పుడన్నా నవ్విందా ఆ మొహం అనుకొనే వాళ్ళం మేము. క్లాసులో అడుగు పెట్టటమే ఆలస్యం. డస్టర్, చాక్ తీసుకొని చకచకా బోర్డుమీద యేవేవో పిచ్చిగీతలు గీసేవాడు. ఆ గీసేది ఎవడి బుర్రలోనైనా ఎక్కతున్నదా అని ఎన్నడూ ఆలోచించేవాడు కాదు. ఒకసారి నేను లేచి "యేమీ తెలియటం లేదుసార్" అన్నాను.

"గో టు హెల్" అన్నాడు చిరాగ్గా.

"యూ-గో టు హెల్" అంటూ నేను బయటకు వచ్చాను. క్లాసంతా గొల్లుమంది. నాతోపాటే మా మిత్ర బృందమంతా బయటకు వచ్చింది. ఎకనామిక్స్ క్లాసంటే రోజూ యింతే, క్లాసుకి రావటం, అటెండెన్స్ యివ్వటం కాస్సేపు ఆ ఆముదము మొహాన్ని యేడిపించటం. అతడు "గో టు హెల్" అనటం, మేమంతా "యూ గో టు హెల్" అనుకుంటూ బయటకు రావడం, క్లాసులో ఆడపిల్లలు, ఆ ఆడపిల్లల్లాంటి మరో పదిమంది బుద్ధిమంతులైన మగపిల్లలు కూర్చోవటం, తలుపులు బిగించుకొని ఆయన పిరియడ్ అయిపోయేవరకు యేదో చెప్పటం మేమంతా బయట మా యిష్టం వచ్చినంతా గోల చెయ్యటం-ఇది తంతు. ఈ ఎకనామిక్సు లెక్చరర్ ఉత్త తలబిరుసుగాడు. ఎప్పుడో వాడి పని పట్టాలని నిర్ణయించుకున్నాం.

ఇక మా పొలిటికల్ సైన్సు లెక్చరర్ సంగతి-క్లాసుకి వచ్చేవాడు. ఒక్కక్షణం కూడా ఊరుకోకుండా రూమ్ టాప్ ఎగిరిపోయేలా పెద్దగా లెక్చర్ దంచేవాడు. మేము ఎంతగా గోల చేసినా ఆయన గోలముందు దండగే అయ్యేది. అతని లెక్చర్లో ఎప్పుడూ 'ప్లేటో' 'అరిస్టాటిల్' అనే పదాలు పదేపదే దొర్లుతుండేవి. ఒకసారి లెక్కవేశాము. మూడువందల నాల్గు సార్లు ప్లేటో, మూడువందల పందొమ్మిదిసార్లు అరిస్టాటిల్ ఆయన లెక్చర్‌లో దొర్లాయి. అసలు యీ ప్లేటో, అరిస్టాటిల్ అనేవి యేమిటో మాకు తెలియలేదు. కొంతకాలం ఆవేవో దేశాల పేర్లు అనుకున్నాము. తర్వాత ఏవో పుస్తకాల పేర్లనుకున్నాము. ఆ తర్వాత

షో, దేర్‌ఫోర్ లాగ మా పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గార్కి అవి రెండు ఊత పదా లయ్యుంటాయని ఊరుకున్నాము.

ఇక మా హిస్టరీ లెక్చరర్‌గారు. ఈయన చాలా మంచివాడు. మాతో చాల చనువుగా ఉండేవాడు అప్పుడప్పుడు మమ్మల్ని హోటళ్ళకు సినిమాలకు తీసికేళ్ళేవాడు. ఎప్పుడూ క్లాసు తీసుకున్న పాపాన పోలేదు. పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు తనకు తెలుసునని పరీక్షల ముందు ఆ పశ్నలు చెప్తానని అవే చదువుకోండని చెప్పేవారు. తన సబ్జక్టులో ఎవ్వరూ ఫెయిల్‌కారని, అవసరమయితే హిస్టరీ ప్రొఫెసర్ దగ్గరకు వెళ్ళి మమ్మల్నందరినీ ప్యాసు చేయిస్తానని మమ్మల్ని నమ్మించేవాడు. ఏమైనా లెక్చరర్స్ అందర్లోకి ఈయన మాకు చాలా నచ్చాడు.

## 6

ఇక మా ప్రిన్సిపాల్ విషయం. చాలా మంచివాడని చెప్పొచ్చు. ఆయనకు రోజూ కాలేజీకి రావటం, ప్రిన్సిపాల్ రూమ్‌లో రెండుమూడు గంటలు కూర్చోవటం మహా బద్ధకం. ఆయనకో కారుంది. హైదరాబాద్‌లో ఓ మేడుంది. ఆయన భార్యాపిల్లలు అక్కడే వుంటారు. అందువల్ల వాళ్ళని విడిచి రోజూ ఒక ఎనభై మైళ్ళ ప్రయాణంచేసి ఈమారుమూల కాలేజీకి రావడం మా పిన్సిపాల్‌కు మరోచెడ్డ చిరాకు. కారులో రోజూ వచ్చి పోతుండేవాడు. కాలేజీకి రావటంతోటే కొన్ని కాగితాల మీద చెక చెకా కళ్ళుమూసుకొని సంతకాలు పెట్టేసి, మళ్ళా కారెక్కి హైదరాబాదులో పడేవాడు. మేము కాలేజీలో చేరిన చాలా రోజులవరకూ ప్రిన్సిపాల్ అంటే ఎలా వుంటాడో చూడలేక పోయాము. చివరకు మా ప్రిన్సిపాల్‌గార్ని స్టూడెంట్స్‌యూనియన్ ప్రారంభోత్సవంరోజున మంత్రిగారు మా కాలేజీకి వచ్చిన రోజున చూడగల్గాము. చూడటానికి బాగానే వున్నాడు. ఆజానుబాహుడు, నిగనిగలాడుతున్న నల్లని శరీరం, మెరిసిపోతున్న నల్లని సూటు చూడగానే ఆయనపట్ల మాకు గౌరవం కల్గింది.

మా ప్రిన్సిపాల్ స్టూడెంట్సు విషయములోను లెక్చరర్స్ విషయములోను - ఒక్క మాటలో కాలేజీకి సంబధించిన ఏ విషయం

లోను జోక్యం పెట్టుకునేవాడు కాదు ఎప్పుడు వీలైతే అప్పుడు, యేదో ఒక సాకుతో హాలీడే డిక్లేర్ చేయటం హైదరాబాద్‌లో పడటం మమ్మ ల్నందరినీ చాల ఆనంద పరిచేది. మేము వరండాలో పడి ఎంత అల్లరి చేసినా, లెక్చరర్లని యేడిపించినా, ఆడ పిల్లలతో సరసమాడినా, పరీక్షలో పుస్తకాలు ముందుపెట్టుకొని నకళ్ళు రాసినా మాకు మా ప్రిన్సిపాల్ యేవిధంగాను ఆటంకంగా కన్పించేవాడు కాదు. మా ప్రిన్సిపాల్ చాల టాక్టుపుల్ పర్సన్ అనీ, ఇంతవరకూ ఈ కాలేజీలో యే గొడవా లేకుండా వుందంటే అందుకు కారణం మా ప్రిన్సిపాల్‌గారి చాకచక్యమేనని మా టౌన్‌లో వాళ్లు అనుకునే వాళ్లు.

# 7

అన్నింటికంటె ముఖ్యమైన విషయం-మా క్లాసులోని ఆడపిల్లల్ని గూర్చిచెప్పాలి. అందులోనూ అందరు ఆడపిల్లల్ని గూర్చి చెప్పాల్సిన పనిలేదు. అందరిలోను కొట్టవచ్చినట్లు కనబడే సువర్చల సంగతి చెబితే చాలు. సువర్చల చాల అందంగా వుంటుంది. అది మగవాడిని రెచ్చగొట్టే అందం. మగవాడిని సవాల్‌చేసే అందం. సువర్చల అలంకరణకూడా మగ వాడ్ని విపరీతంగా రెచ్చగొటేలా వుండేది. ఆమెనుచూస్తే మగవాడి అట్టడు గున నిద్రిస్తున్న కోరికలు తోక తొక్కిన తాచులా ఒక్కసారి బుసకొడ్తూ లేచేవి. అంతేకాదు తనకేసి ఆశగాచూసే మగవాళ్లను ఈగల్లా దులప రించుకుపోయే ఒక భరించలేని నైర్లక్ష్యంకూడా సువర్చలలో వుండేది. చాలమంది మా కాలేజీ హీరోలు సువర్చల జోలికిపోయి చేతులు కాల్చుకున్నారు. ఎవరైనా సరే - ఆమె నేమైనా అంటే వెంటనే ఎదురు మళ్లుతుంది. చెప్పులు చూపిస్తుంది. అసలు ఒక విషయం చాల మందికి తెలుసో తెలియదో - ఎంత ఎక్కుపెట్టిన మీసాలున్న వాడయినా ఆడది ఎదురు తిరిగి ఘాటుగా జవాబుచెప్తే తగ్గుతాడు. నిజానికి రౌడీలుగా పేరుపొందిన మాలాంటి చాలామందికి ఆడపిల్లలంటే ముఖ్యంగా సువర్చలలాంటి ఆడపిల్లలంటే ఓవైపు భయమే—కాని రౌడీలుగా మా కీర్తిప్రతిష్టలు ఎక్కడ అంతరిస్తాయోనన్న భయంతో మేము ఆడ

పిల్లలను ఏడిపించే ప్రయత్నం చేస్తుంటాము. అయితే మా మిత్ర బృందంలో చాలామందిని సువర్చల వీరోచితంగా అవమానించింది. మాలో మా రెడ్డి మహా ప్రమాదకరమైన మనిషి. ఒకరోజు ఎక్కడో సువర్చల ఒంటరిగా కనబడుతే ఆమె దగ్గరకువెళ్ళి రహస్యంగా "రాత్రికి కలిసికుందాము"అని అడిగాడట. సువర్చల వెంటనే స్కౌండ్రల్, రాస్కెల్" అంటూ భగ్గున మండిపోయిందట. అలాగే మా ఆచారి సువర్చలను ఏదో బూతుమాట అంటే ఆవిడ చెప్పు చూపించిందట.

ఈ కారణంగా ఒకరోజు మా మిత్రబృందం సమావేశమై సువర్చల విషయం చర్చించింది.

"సువర్చల-దట్ సూర్యాకాంతం ఆఫ్ అవర్ కాలేజి - రోజు రోజుకు పేట్రేగి పోతున్నది. దాని పొగరు ఎలాగైనా అణచి వేయక పోతే మన మూతి మీసాలుండి లాభంలేదురా-" అన్నాడు మా రెడ్డి.

"సువర్చల-అందాలరాణి - అలౌకిక సౌందర్య దేవత - ముసలి డొక్కు సూర్యకాంతంతో పోల్చడానికి నీకు నోరెలా వచ్చిందిరా? పొగరువుంటే వుండవచ్చు. ఆ ఈడు, ఆ అందం, ఆ చందం, ఆ తీవి ఉన్న ఆడదానికి ఆ మాత్రం పొగరువుండటం సహజమే" అన్నాడు ఏదో కవిత్వం లాంటిది గిలుకుతున్న మా గోవిందు.

"ఏడ్చావులేరా నీకవిత్వం నువ్వూనూ. దాని పొగరుకు అదుపూ, ఆజ్ఞా లేకుండాపోయింది. మొన్నేం చేసిందో తెలుసా! మన ఆచారి గాడు ఏదో అంటే వాడికి చెప్పు చూపించింది. కదురా ఆచారిగా" అన్నాడు గోపాల్.

"ఇంతకూ యేమన్నావురా సువర్చలను?" నేను నవ్వుతూ.

"ఏమంటే మాత్రం - ఆడది నాకు చెప్పు చూపిస్తుందా? దాన్ని చంపేయాలన్నంత కసిగా వుందిరా — అరే సురేన్ నువ్వే యేదైనా ప్లాను ఆలోచించాలిరా. దాని పొగరు అణచివేయడానికి" అన్నాడు ఆచారి.

"యేముంది - మనమంతా దాన్ని ఒక రాత్రి ఎత్తుకుపోయి ఒకరి తర్వాత ఒకరం దాన్ని రేప్ చేస్తేగాని దాని పొగరు అణగదు" రెడ్డి ఆలోచన.

"అందరికంటె మొదట నేనే" అన్నాడు ఆచారి.

అంతా గొల్లుమన్నారు.

"నీ మొహం - దాని పని నేను పడ్తాను" అన్నాను నేను. వాళ్ళందరిలో నా లీడర్‌షిప్- ఎక్కడ జారిపోతుందోనన్న భయంతో, నే నామాట అన్నాను. అంటే - మా మిత్రబృందమంతా సువర్చల గర్వభంగం చేసే బాధ్యత నామీద పెట్టారు. సువర్చలను యేడిపించాలి - హింసించాలి-వేటాడాలి-వేధించాలి-నవ్వులపాలు చేయాలి-చివరకు సువర్చల చేత మా మిత్రబృందాని కంతటికీ క్షమార్పణ చెప్పించాలి. అంతవరకు వదలకూడదు. సువర్చలచేత క్షమార్పణ చెప్పించడానికి ఒక నెలరోజులు గడువు కోరాను నేను.

అంటే - ఆరోజునుండి ప్రారంభమైంది. మా ఆర్గనైజ్డ్ ఎటాక్ ఆన్ సువర్చల. మొదట కాలేజీ గోడలన్నీ సువర్చలమీద బూతులతో నింపేశాము. బూతులు రాయటంలో మా ఆచారి అఖండుడు. వాడే ఆ పని చేశాడు. స్కాండల్స్ పుట్టించడంలో మా రెడ్డి అఖండుడు. మా ఇంగ్లీషు లెక్చరర్‌కు, సువర్చలకు క్షణంలో సంబంధాన్ని సృష్టించి ప్రచారం చేయసాగాడు రెడ్డి. నేను క్లాసులో సువర్చల వెనకాలే కూర్చొని సువర్చలను నానా మాటలనటం మొదలుపెట్టాను. కాలేజీకి సువర్చల యింటికీ మేము రోజూ లెఫ్ట్, రైటు కొట్టటం మొదలెట్టాము. పిల్లికూతలు, నక్కకూతలు కూయడంలోకూడా మా ఆచారికి అద్భుతమైన ప్రావీణ్యం వుంది. రోజూ మా గుంపు సువర్చలతో కాలేజీకి కాలేజీనుండి యింటికి ఆమె వెంటపడినపుడు ఆచారి కాసేపు పిల్లిలా, కాసేపు నక్కలా అరిచేవాడు. కాసేపు కుక్కలా మొరిగేవాడు. కాసేపు గాడిదలా అరిచేవాడు, కాసేపు కోతిలా కిచకిచ మనేవాడు. మేమంతా గొల్లున కడుపు చెక్కలయ్యేలా నవ్వుతుండేవాళ్ళం. ఇలా సువర్చలను ఎక్కడ దొరికితే అక్కడ వేటాడు తుండేవాళ్ళం. ఆమె క్లాసులో వున్నా, కాలేజీ నుండి యింటికి వెళ్ళినా, ఇంటి నుండి కాలేజికి వెళ్ళినా వదిలే వాళ్ళం కాదు. ఆమె సినిమాకు వెడితే ఆమె వెనకాలే మేము కూర్చునే వాళ్ళం. ఆమె బజారుకు వెళ్ళినా షాపింగ్‌కు వెళ్ళినా మేము అక్కడ తయారయ్యే వాళ్ళం. ఆమె ఏక్షణంలో ఎక్కడ

వుంటుందో మాకు వెంటనే తెలియజేసే సాధనాలన్నీ సమకూర్చుకున్నాం. ఇలా సువర్చలకు ఊపిరి సలపకుండా చేశాము. దీని కంతటికి లీడర్‌షిప్ నాదేనని మా కాలేజీలో అందరకు తెలిసి పోయింది. ఈ కారణంగా కాలేజీలో నా పలుకుబడి తెగ పెరిగిపోయింది. వచ్చే సంవత్సరం ప్రెసిడెంట్ షిప్‌కు పోటీచేస్తే తప్పకుండా గెలుస్తానని నా భుజం తట్ట సాగారు జనం.

ఇంత జరుగుతున్నా సువర్చలలో చలనం లేక పోవటం నామతిని పోగొట్టింది ఇంకా రెచ్చిపోయాను. సువర్చలను ఏడిపించటం ఎక్కువైంది. క్లాసుల్లోనూ మా గోల మిన్ను ముట్టింది. లెక్చరర్ రావటం. 'హచ్చి' అని మా ఆచారి తుమ్మటం తర్వాత నక్కలా కూయటం, మేమంతా గొల్లున నవ్వటం, సువర్చల మీదికి కాగితపు బాణాలు, గురిపెట్టి వదలటం లెక్చరర్ 'సైలెన్స్' అని గొంతు చించుకోవటం. నా గోల యింకా యెక్కువై పోవటం, ఆయన క్లాస్ కాన్సెల్ చేసి వెళ్ళిపోవటం ఇదీ ప్రతీ క్లాసులో జరిగే తంతు, ఒకరిద్దరు లెక్చరర్స్ నన్ను పిలిపించి అడిగారు. "ఏమిటాగోల" అని, "సువర్చల మా ఫ్రెండ్స్‌ని ఇన్‌సల్ట్ చేసింది. క్షమాపణ చెప్పుకునే వరకు ఊరుకునేది లేదు" అని చెప్పేశాను.

ఇది ఇలా వుండగా మా ప్రిన్స్‌పాల్ ట్రాన్స్‌ఫర్ అవబోతున్నాడనే వార్త వినవచ్చింది. చాల మంచివాడు. ఈ ప్రిన్స్‌పాల్, వచ్చేవాడు కూడా ఇలాంటి వాడైతే బావుండును అనుకున్నాము మేమంతా.

## 8

అకస్మాత్తుగా సువర్చలలో ఒక మార్పు గమనించాను. నా కేసి అదోలా చూడటం మొదలెట్టింది. నేను యెక్కడన్నా వంటరిగా కనిపిస్తే నాకేసిపదే పదే చూడటం, చిరునవ్వు నవ్వటం మొదలెట్టింది. నిజం చెప్పొద్దూ, సువర్చల నాకేసి అలా ఆదరంగా, ఆహ్వానిస్తున్నట్లుగా చూసినప్పుడు నేను ఎలా ఫీలయ్యానో మాటల్లో చెప్పలేను. ఇంతకాలం సువర్చల మీద ఏర్పడిన అర్థరహితమైన ద్వేషాన్నంతా ఆ ఒక్క

చూపు ఒక్కక్షణంలో తుడిచివేసింది. సువర్చల వేడిగా, వాడిగా, పొగరుగా, జుగుప్సగా, నిర్లక్ష్యంగా మొగవాళ్ళంతా చీడపురుగు లన్నట్లుగా చూడటం తెలుసు నాకు. కాని ఇప్పుడు నాకేసి చూస్తున్న సువర్చల చూపుల్లో యివేవీ లేవు. ఇప్పటి చూపుల్లో ఆదరపూర్వకమైన ఆహ్వానం ఉంది. నీ కోసమే ఎన్నో యుగాలుగా ఎదురుచూస్తున్నాను. నువ్వే నా సర్వస్వం - నామీద ఎందుకు నీకీ నిష్కారణమైన ద్వేషం? నీద్వేషంతో నీకోసం అంకితమైన నా హృదయాన్ని తెలుసుకోలేక పోతున్నావు. ఇలా ఏవేవో లక్ష భావాల్ని ఆమె కళ్ళలో స్పష్టంగా, గజిబిజిగా, చిందరవందరగా చదువుకున్నాను. అంతే! ఆమె మీదున్న ఆ పూర్వపు అర్థంలేని ద్వేషం పూర్తిగా పోయింది. సువర్చల పట్ల ఏదో నాలో నాకు తెలియని ఒక ఆరాధన లాంటిది ప్రారంభమైంది. ఇన్నిరోజులు చాల అజ్ఞానంగా ప్రవర్తించానన్న పశ్చాత్తాపం కూడా కల్గింది. మా వాళ్ళందర్నీ చెడామడా తిట్టాను. "సువర్చలను ఎవడైనా ఏమన్నా అంటే వాడి బొవుకలిరుగుతాయని" చెప్పాను. నేను తమాషాకు అంటున్నా ననుకున్నారు మావాళ్ళు. ఆ తర్వాత "సువర్చల వీడికేదో పొగేసిందిరోయ్" అన్నాడు రెడ్డి—ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే ఘటం రెడ్డి. ఇలా జరుగుతున్న కొద్దిరోజుల్లోనే మరో సంఘటన జరిగింది.

ఒక్కణ్ణే బజారుకెళ్ళి యింటికొస్తున్నాను. దార్లో సువర్చల కూడా ఒక్కతే కన్పించింది. నాగుండె ఝల్లుమంది (ఈమధ్య సువర్చలను ఎప్పుడు చూచినా నాకు యిలాగే అవుతున్నది). నాకేసి అలాగే ఆహ్వానిస్తున్నట్లుగా చూసింది. అంతేకాదు - నన్ను తన దగ్గరకు రమ్మన్నట్లుగా కూడా సైగచేసింది. నా గుండెలు వేగంగా కొట్టుకో సాగాయి. లోపల ఏదో దడలాంటిది కూడ ప్రారంభమైంది. నడిబజారులో తనదగ్గరకు రమ్మని ఆహ్వానిస్తున్న సువర్చల ధైర్యం నన్ను నిలువునా ఊపివేసింది. సంకోచిస్తూనే అతివేగంగా కొట్టుకుంటున్న గుండెలతో ఆమెను సమీపించాను.

చాల గోముగా మూతిపెడ్తూ, చిలిపిగా కళ్ళు తిప్పుతూ "ఏమండీ నేనంటే మీకు చాలకోపంగా వుంది కదూ ?" అంది.

నాకు వెంటనే నోటమాట రాలేదు.

"అబ్బే—ఏంలేదండి—ఏదో" అంటూ గొణిగాను.

"పోనీలేండి—ఒకసారి మాయింటికి రారూ ? మీతో చాలా ముఖ్యమైన పనివుంది." మళ్ళా అలాగే చాలగోముగా అంది.

"నాతో నా—ముఖ్యమైన పనా—యేమిటది !" నామతి పోతోంది.

"చెప్తాగా....ఎన్నాళ్ళుగానో మిమ్మల్ని ఒకసారి మా యింటికి ఆహ్వానించాలను కుంటున్నాను....ఈ నాటికి ఆ అదృష్టం కల్గింది. తప్పకుండా వస్తారు కదూ ! రేపు ఆదివారం కదూ ! రేపే రండి ఏం — వస్తారు కదూ?" అంటూ వేయి జ్యోతుల ప్రకాశాన్నంతా తమలో వెలిగించుకున్న కళ్ళతోనే ప్రశ్నించింది సువర్చల.

మూతిమీద మీసాలున్న మగవాడెవడూ ఆ ఆహ్వానాన్ని కాదనలేడు మంత్రముగ్ధునిలా.

"అలాగేనండి....వస్తాను—తప్పకుండా వస్తాను" అన్నాను.

"థాంక్సండీ—తప్పకుండా రండి. మీ కోసం వెయిట్ చేస్తుంటాను" అంటూ సువర్చల వెళ్ళిపోయింది.

ఆ రాత్రంతా నిద్రపోలేకపోయాను. సువర్చలను గూర్చి లక్ష ఆలోచనలు, లక్ష కలలు, కోటిరూపాలతో, కోటిభంగిమల్లో సువర్చల నాకళ్లల్లో నృత్యం చేయసాగింది. తప్పకుండా అందుకే పిలిచింది. తప్పకుండా అందుకే పిలిచింది సువర్చల నన్ను ప్రేమిస్తూంది. నన్ను ప్రేమిస్తూంది అన్న భావం నాలో మెదిలినపుడు చంద్రమండలం మీద అడుగు పెట్టిన క్షణంలో ఆర్మ్‌స్ట్రాంగ్ అనుభవించిన థ్రిల్‌ని నేను అనుభవించాను. సువర్చల "మిమ్మల్ని ప్రేమిస్తున్నానండి" అని నాతో చెప్పడానికే నన్ను రమ్మంది. అకస్మాత్తుగా ఆ కోతి మొహపు సరళ జ్ఞాపకమొచ్చింది. నిన్ను ప్రేమిస్తున్నాను బావా! నన్ను పెళ్ళిచేసుకోవూ అంటూ ప్రాణాలు తీసేసేది సరళ వాళ్ళ ఊరు వెళ్ళినప్పుడల్లా, ఈ కోతి మొహాన్ని ఎలా వదిలించుకోవాలిరా బాబూ అని నేను సతమతమై

పోయేవాడిని. సువర్చలను ప్రేమించి పెళ్లిచేసుకుంటే సరళ పీడ వదలి పోతుంది.

సువర్చల నన్ను తన ఇంటికి ఆహ్వానించిందన్న వార్త మాకోతి మూకకు చెప్పలేదు. వెధవలు తెలిస్తే ఏడ్పిచస్తారు.

# 9

తెల్లవారగానే నీట్‌గా తయారయ్యాను. ఇంతసేపు చెప్పలేదు గాని, మనది బ్రహ్మాండమైన పర్సనాలిటీ ఏ దేవానంద్, గీవానందైనా మన తర్వాతే.

ట్రిమ్ముగా తయారై సువర్చల యింటి ముందు వాలాను. ఔను! సువర్చల నా కోసమే ఎదురుచూస్తోంది. నన్ను చూడగానే "సురేంధర్ గారు—రండి—రండి" అంటూ నిండుగా ఆహ్వానించింది. పరవశించి పోతూ యింట్లో అడుగుపెట్టాను. సువర్చలది చాల పెద్దయిల్లే. మెయిన్‌గేటు దాటి, వరండా దాటి, డ్రాయింగ్, రూంలోకి వెళ్లాను. ఇంట్లో సువర్చల తప్ప మరెవరూ ఉన్నట్లు తోచలేదు.

"కూర్చోండి సురేంధర్‌గారూ" అంది సువర్చల అకస్మాత్తుగా. ఆ మాటల్లో ధ్వనించిన వ్యంగ్యం నా రక్తంలోకి ఎలక్ట్రిక్‌షాక్ నే పంపించింది. మరుక్షణంలో సువర్చల కుట్ర అర్థమైపోయింది. కూర్చొ బోతున్న వాడిని అలాగే ఆగిపోయాను.

"అలా——ఉలిక్కిపడతారేం సురేంధర్‌గారు——కాదు కాదు కాలేజీ గర్ల్స్ పాలిటి యమ ధర్మరాజుగారు—కూర్చోబోయి ఊరు కున్నారేం ?" అంది సువర్చల.

సువర్చల మొహంలో ఎప్పుడూ మామూలుగా కన్పించే ఆ ద్వేష భావం, అసహ్యం, జుగుప్స ఎప్పటికంటె యిప్పుడు వెయ్యింతలై కన్పించాయి. నన్ను నిలువునా కాల్చి వేసేంత భయంకరంగా కన్పిం చింది సువర్చల.

నా గుండెని ఎవరో మెత్తని సూదులతో గుచ్చుతున్నట్లుగా ఫీలయ్యాను అవమానంతో గొంతంతా పూడుకుపోయింది. సువర్చల

పన్నిన కుట్రలో వెర్రివాడిలా పడిపోయానన్న నా మీద నాకు జనించిన అసహ్యం నన్ను నిలువెల్లా దహించి వేసింది. అయినా ఇంటికి రమ్మని పిలిచి సువర్చల యిలా అవమానిస్తుందా : నా రక్తం కుత కుత ఉడికి పోయింది. నా నోట మాటరాలేదు.

"అలా బిత్తరపోయి చూస్తారేం హీరో సురేశ్‌గారు? మీ చుట్టూ ఎప్పుడూ వుండే మీ కుక్కలు, నక్కలు, గాడిదలు, కోతులు మీ సహాయానికి రాలేకపోతున్నారనా ? కాని ఒక నిస్సహాయురాలైన ఆడ దాన్ని నడిబజార్లో అవమానించడానికి వెనుకాడరేం ? మీకు నాలాంటి చెల్లెళ్ళు లేరూ ? మీ చెల్లెల్ని ఎవడైనా నడిబజార్లో పట్టుకొని అవమా నిస్తే వూరుకుంటారా? అసలు మీరు మనుష్యులేనా ? మీలో యే మూల నైనా మానవత్వం అనేది వుందా ? అసలు పశువులకు మీకు భేదం వుందా ? మీకు నే నేం ద్రోహం చేశాను ? నా వెంట ఎప్పుడూ దయ్యాల్లా, భూతాల్లా ఎందుకట్లా పడ్తారు!"

అంతకంతకు గొంతు హెచ్చించి అతి తీవ్రమైన ఆవేశంతో సువర్చల మాట్లాడుతుంటే నా బుర్ర గిర్రున తిరిగిపోయింది. అవ మానంతో నా రక్తం వేడెక్కి వెర్రిగా మరిగిపోయింది. ఇంటికి పిలిచి ఇంత అవమానం చేస్తుందా? బ్లడీ బిచ్-సువర్చల గొంతు పిసికి వేయాలన్నంత కసిపుట్టింది నాలో, కాని గొంతు పెగిలి మాటరాలేదు.

ఇంతలో "ఎవరితోనే మాట్లాడుతుంట" అంటూ ఓ వయస్సు మళ్ళినావిడ వచ్చింది. సువర్చల తల్లి అయ్యుంటుంది.

"ఈయననేనే—రోజూ నా ప్రాణాలు తోడేస్తున్న నా పాలిటి బ్రహ్మరాక్షసుడు. పాపం పిలువగానే ఎలా లొట్టలు వేసుకుంటూ వచ్చాడో చూడు. ఆడదాన్ని పట్టుకొని గేలి చేయటానికి తయారైన ఈ వీరులు. అదే ఆడది ఒక్క చిరునవ్వు నవ్వితే చాలు దాని చుట్టూ కుక్కల్లా తిరిగి దాని కాళ్ళమీద పడటానికి తయారౌతారు" అంది సువర్చల.

ఇక ఊరుకోలేక పోయాను—

"సువర్చలా—యింటికి పిలిచి—యింటికి రమ్మని పిలిచి.... యిలా.... ఈ విధంగా అవమానిస్తావా?—చూడు—" మాటలు స్పష్టంగా

రావటంలేదు. ఈ మాటలతో సువర్చలకు ఉక్రోషం ఇంకా ఎక్కువైంది తోకతొక్కిన తాచులా లేస్తూ.

"అవమానించానా? నెల రోజులుగా నన్ను ఊపిరి పీల్చుకో నివ్వకుండా నా వెంటపడి నన్ను నిర్దాక్షిణ్యంగా హింసిస్తున్నావే? వేట గాడిలా వేటాడుతున్నావే—సినిమాకి వెళ్ళినా; షాపింగ్‌కి వెళ్ళినా నా వెంట రాక్షసుడిలా పడి పీడిస్తున్నావే – ఇంటికి పిలిచి అవమానిస్తే యింతరోషం వస్తున్నదా? నేనూ నీలాంటి రోషంగల మనిషినే నని మీకెలా అర్థమౌతుంది––" యింకా––యింకా నీవేమేమో అనబోతు న్నది సువర్చల. యింతలో నాలో యేదో శక్తి నన్ను ముందుకు తోసింది.

"యూ –– యూ –– బ్లడీ –– బిచ్" యింటికి పిలిచి యిన్ని మాటలంటావా? నువ్వు రేపు కాలేజీకి రా" అంటూ గేటువైపు తిరిగి పోయాను.

"ఏమన్నావురా –– రాస్కెల్" అని అరుస్తూ సువర్చల అక్కడే వున్న ఓ స్లిప్పర్‌ని నామీదికి విసిరింది. అదివచ్చి నామొహాన్ని తాకింది.

# 10

ఎలా రూమ్ చేరుకున్నానో తెలియదు. దార్లో రెడ్డి, ఆచారికలసి పలకరించబోతే కసరుకున్నాను, ఇంటికొచ్చి కూలబడ్డాను.

సువర్చల పిలవగానే ఎందుకు పిలుస్తోందన్న ఆలోచన లేకుండా ఎంత వెర్రిగా—ఎంత గ్రుడ్డిగా ఆమె పన్నిన కుట్రలో పడిపోయాను. యేం చెయ్యాలిప్పుడు ఏదో చెయ్యాలి. సువర్చల రక్తాన్ని కళ్ళ చూడాలి. సువర్చల జీవితమంతా బుగ్గిపాలు చేయాలి. ఇంటికి రమ్మని నన్ను యింత ఘోరంగా వంచించిన సువర్చల పొగరును శాశ్వతంగా అణచివేయాలి. సువర్చల జన్మలో మరిచిపోలేని గుణపాఠం నేర్పాలి. కాని ఎలా? ఎలా? ఎలా? ఈ రాత్రికి రాత్రే సువర్చల ఇంటిగోడ

దూకి, దాని గదిలో చొరబడి రెడ్డిగాడన్నట్టు దాన్ని రేప్ చేస్తేగాని నా కసి తీరదు.

ఇంతలో రెడ్డి ఆచారి రానే వచ్చారు.

"ఏమిట్రా పిలుస్తుంటే అలా పరుగెత్తుకుంటూ వచ్చావు"-ఆచారి

'ఏమిటి' ముఖమంతా కందగడ్డలా మారింది. ఏమిటి అసలు సంగతి" రెడ్డి ఏదో జరిగిందని ఊహించినట్లున్నారు.

"ఏం లేదురా" అన్నాను చిరాగ్గా.

"అబ్బే యేదో వుంది. ఎవడైనా యేమైనా అన్నాడా?" ఆచారి.

"నన్ను యేదైనా అని బతికేవాడెవడు ఈ ఊళ్లో—" నేను.

"మరి ఏమిట్రా అలా వున్నావు. మొహాన కత్తి వేసిన నెత్తురు చుక్కలేదు. ఏం జరిగిందో చెప్పు. అసలు నువ్వు యిప్పుడు ఎక్కడి కెళ్ళి వస్తున్నావు?" రెడ్డి.

పళ్ళు కొరుకుతూ అన్నాను—

"సువర్చలరా—సువర్చల—సు—వ—ర్చ—ల."

"ఆ! సువర్చల ఇంటికెళ్ళావా? కొంపతీసి స్లిప్పర్స్ తీయలేదు గదా—నా మీదికి తీసినట్లు" ఆచారి.

"బౌన్రాఫూల్! నీ కారణంగానే సువర్చల వెంటబడ్డాను. ఇవాళ యింటికి పిలిచి నీమీదికి విసిరివేయాల్సిన స్లిప్పర్ నామీదకు విసిరేసింది" అన్నాను ఆచారిగాడి వీపుమీద ఒకటి గట్టిగా అంటిస్తూ.

"ఇంతకీ యేం జరిగిందో చెప్పు. సీరియస్‌గా అడుగుతున్నాను—" రెడ్డి.

"సీరియస్‌గానే చెబుతున్నాను. సువర్చల నన్ను తన యింటికి ఆహ్వానించింది. ఉత్త చవటలా వెళ్లాను. నెలరోజులనుండి దాని వెంట పడి యేడిపిస్తున్నందుకు నాకు చేయవలసిన సన్మానమే చేసింది."—నేను.

"ఏంచేసింది—నిజం చెప్పు—" రెడ్డి.

"నువ్వో ఇడియట్‌వి....నిజం చెప్పకపోతే, అబద్ధం చెబుతున్నా ననుకుంటున్నావా? దొంగ ప్రేమంతా వొలకబోస్తూ, దొంగ నవ్వులు నవ్వుతూ—"ఒకసారి మా ఇంటికి రారూ!" అని పిలవగానే నేను ఐపై

పోయి ఉత్త మొద్దులా అది పన్నిన వలలోకి చిక్కుకుపోయాను. దాని యింటికి వెళ్లాను."—నేను.

"ఊ—ఆ తర్వాత—" రెడ్డి.

"ఆ—తర్వాత మేముంది. నువ్వు మనిషివి కాదు జంతువన్నది. నెలరోజులుగా నన్ను హింసిస్తున్నావంది. మాటమీద మాట పెరిగి "యూ బ్లడీ బిచ్" అన్నాను నేను. అంతే— అది కోపంతో శివమెత్తి పోతూ నా మీదకు చెప్పు విసిరేసింది.

"దొంగ లంజ—ఎంతపని చేసిందిరా!"—ఆచారి. "మెదలకుండా వచ్చేశావా!"—రెడ్డి.

"ఏం చెయ్యమంటావు ? దానింట్లో దాన్ని యేం చెయ్యగలం. మనబుద్ధి గడ్డితిని దానింటికి వెళ్లాను" నేను.

"వాట్ ఏ గ్రేట్ ఇన్‌సల్ట్! నిన్ను ఇన్‌సల్ట్ చేసిందంటే కాలేజీ లోని మొత్తం వెయ్యి మంది స్టూడెంట్స్‌ని ఇన్‌సల్టు చేసిందన్న మాట. ప్రతీకారం చేసి తీరాల్సిందే. ఏమైనా సరే ప్రతీకారం చేసి తీరాల్సిందే—" —మీసం మెలివేస్తూ రెడ్డి.

"ఏం చేద్దామంటావు"—నేను.

"ఏదైనా చెయ్యాలి. ఎన్ని గుండెలురా దానికి ? నీ మీదికే చెప్పు విసురుతుందా! అంత కొవ్వెక్కిందా దానికి — దొంగలంజ — దాన్ని ఏం చేస్తానో చూడు"—రెడ్డి.

"ఏం చేస్తావురా ?"—నేను.

"అది సాయంకాలం వేళల్లో సినిమాకో — షాపింగ్‌కో వెళ్ళే సమయం చూసి మనమో అయిదారుగురం కలిసి దాన్ని కిడ్‌నాప్ చేసుకు పోవాలి. ఆ తర్వాత—చెప్పానుగా—రేప్—అప్పుడుగాని దాని కొవ్వు మదం అణగిపోవు. యేమంటావు"—రెడ్డి.

రెడ్డి ప్లాను వింటుంటే నాకు భయమేసింది. రెడ్డిగాడు సామాన్యుడుకాడు. వాడు ఊరికే మాటలనటమేకాదు—ఆ మాటల్ని చేతలుగా మార్చే శక్తి కూడా వాడికుంది. నిజం చెప్పాలంటే వాడంటే నాక్కూడా ఒకమూల భయమే. నేనేదో సరదాకోసం రౌడీగా పోజుకొడ్తూ తిరుగు

తున్నాను. కాని రెడ్డి అలాకాదు. వాడు నిజమైన రౌడీ. కొంపలు కూల్చేరకం. తలలు మార్చేరకం.

"వద్దులేరా! అంత పని వద్దు—మరేదైనా ఆలోచిద్దాం" అన్నాను.

"కొంచెం గుండెవున్న మగాడివనుకున్నా. అలా నీరు కారి పోతావేరా? మొహం మీదకు చెప్పు విసిరేసిన కొవ్వెక్కిన ఆడదానికి అదే దివ్యౌషధం. ఆ తర్వాత నీ యిష్టం"—రెడ్డి.

"నా కిప్పుడేమీ తోచడంలేదు. తర్వాత ఆలోచిద్దాం. ఇప్పటికి నన్నిలా వదలివేయండి." అన్నాను నే చిరాగ్గా.

రెడ్డి, ఆచారి వెళ్లిపోయారు.

కాని మా వాళ్ళు నన్ను ఎంతోసేపు వదలలేదు. సువర్చల నా మీదకు చెప్పు విసిరేసిందన్నవార్త నాస్నేహితుల్లో అతివేగంగా వ్యాపించి పోయింది. దాల్లో కనిపించన ప్రతివాడికి ఈ వార్త అంటించారు రెడ్డి, ఆచారి. ఇంకేముంది ఒకడి తర్వాత ఒకరు నన్ను పరామర్శించటానికి రాసాగారు. గోవిందు, గోపాలు, మోహన్, నరేందర్—యిలా అందరూ వచ్చి నాచుట్టూ చేరారు. గుంపంతా చేరింతర్వాత మళ్ళీ ఆచారి, రెడ్డి వచ్చారు. ప్రతివాడు—"ఎంత ఘోరం జరిగిందిరా" "దానికి ఎన్ని గుండెలురా" "దానికి పోయేకాలం వచ్చిందిరా" "నీమీదికే నీమీదికే చెప్పు విసురుతుందా దాని కళ్లు నెత్తికెక్కాయిరా" "ఇది నీకు జరిగిన ఇన్‌సల్టు కాదు మా అందరికీ అంటే ఈ కాలేజీలో మూతిమీద మీసం వున్న ప్రతి మగవాడికి జరిగిన అవమానం యిది — దీనికి తగిన శాస్తి చేసి తీరాల్సిందే. చెప్పు నువ్వు—ఏం చెయ్యమంటే అది చేస్తాము—దాని కాళ్లు, చేతులు కట్టి నీ ముందు పడెయ్యమంటే పడేస్తాము—చెప్పు ఏం చెయ్యమంటావో చెప్పు?"

అంటూ నా చుట్టూచేరి నన్ను ఉక్కిరి బిక్కిరి చేశారు. విషయం నా చేతిని దాటిపోయింది. నే నిప్పుడు "సువర్చలను ఏం చేయా ల్సిన పనిలేదు" అన్నా ఎవడూ వినేట్టులేడు. ఏదో చెయ్యకపోతే నన్ను చచ్చు దద్దమ్మక్రింద జమకట్టేట్టున్నారు. నేను ఇన్నాళ్లగా రౌడీగా తిరిగింది, లీడర్‌గా తిరిగింది-కేవలం పోజుకోసమేనంటారు. "పైన పటారం లోన లొటారం" అని గేలిచేస్తారు. ఏది ఏమయినా రౌడీగా,

లీడర్‌గా నా పేరు ప్రతిష్టలు సన్నగిల్లటం నా కేమాత్రం యిష్టంలేదు. పైగా ఇది నా వ్యక్తిగత సమస్య కాదని కాలేజీలోని వెయ్యిమంది విద్యార్థులకు సంబంధించిన సమస్య అని ప్రతివాడు నాతో గొంతు చించుకొని చెప్పడం నాకెంతో తృప్తిని కలిగించింది. ఇవ్వాళ నేను ఏమీ చేయకుండా చచ్చుదద్దమ్మలా పడివుంటే నాతోటి వేయిమంది విద్యార్థులను అవమానించిన వాడినౌతాను. అందువల్ల నేను ఏదో చేయాలి. నాతోటి విద్యార్థుల పరువును నిలబెట్టాలి.

"ఇంతకు నన్నేం చెయ్యమంటారో మీరే చెప్పండి" అన్నాను వాళ్ళతో. చాలాసేపు తర్జనభర్జనలు జరిగాక చివరకు మాఆచారిగాడు సూచించిన ఒకప్లాను అందరికి నచ్చింది. వాడి ప్లాను ఇది.

రేపు సువర్చల కాలేజీ గేటులో ప్రవేశించగానే అంతా వెంట పడాలి. తర్వాత నేను సువర్చల పమిట లాగేసి ఆమెను నానా అల్లరి చెయ్యాలి. నా స్నేహితులందరి ముందు నాకు క్షమాపణ చెప్పేవరకు రోజూ ఇలాగే జరుగుతుందని ఆమెను హెచ్చరించాలి. ప్లాను నాకు నచ్చింది. రెడ్డిగాడి ప్లానుకంటే ఇది చాలా నయం. దీనికి నేను ఒప్పు కున్నాను. రేపే దీనిని ఆమలుపరచడానికి ఏకగ్రీవంగా ఆమోదించాము. ఈ ప్లాను "ఉత్త వెధవప్లాను" అని అభిప్రాయపడ్డాడు రెడ్డి.

ఏమైనా నన్ను ఘోరంగా వంచించిన సువర్చలకు తగిన శాస్తి జరుగ బోతున్నదన్న ఫీలింగ్ నన్ను చాలా ఓదార్చింది. పైగా నా మీద ఈగవాలినా సహించని స్నేహితులు నాకు ఉన్నారన్న నమ్మకం కూడా నాకు ఎంతో సంతృప్తిని కల్గించింది.

## 11

తెల్లవారింది. 8 గంటలకే రెడ్డి, ఆచారి, గోవిందు మొదలైన గుంపంతా వచ్చేసింది. అందరమూ తయారై అయ్యర్ హోటల్లో బాగా తిని (అయ్యర్ హోటల్లో మేము ఎంతతిన్నా, యేదితిన్నా బిల్లు చెల్లించా ల్సిన పనిలేదు) కాలేజీకి బయల్దేరాము.

కాలేజీ సమీపించేటప్పటికి మా గుంపు చాలా పెద్దదైంది. ప్రతి వాడుయేదో వాగుతూనే వున్నాడు. కేరింతలు కొడ్తున్నాడు కాని నా లోపల మాత్రం యేదో దడ ప్రారంభమైంది. జరుగబోయేది ఊహించుకుంటే గుండెలు గుబగుబ లాడాయి. అకస్మాత్తుగా వళ్లంతా చెమటలుకారటం మొదలైంది. క్షణక్షణానికి నా చుట్టూవున్న గుంపులో ఉత్సాహం ఎక్కువైంది. మామూలుగా ఒకడు కుక్కలా, మరొకడు నక్కలా, యింకొకడు గాడిదలా అరుస్తూనే వున్నారు. అంతా ఏదో బ్రహ్మాండమైన విందును ఆరగించబోతున్నట్లుగా మురిసి పోతున్నారు. నేను మాత్రం వాళ్లల్లో ఒకడిని కాలేకపోయాను. వాళ్ళ మధ్యలోనే ఉన్నా, వాళ్లకూ నాకూ కొన్ని కోట్ల మైళ్ల యెడమైనట్లు ఫీలయ్యాను. మొదటిసారిగా స్టేజీ ఎక్కబోయే కుర్రాడిలా వణికిపోతున్నాను. ఈ పరిస్థితుల్ని ఎందుకు తెచ్చుకున్నానని నన్ను నేను తిట్టుకోవడంకూడా మొదలైంది. ఈ రౌడీవేషాలు ఎందుకు వేశాను. నా చుట్టూ ఈ కుక్కల్ని, నక్కల్ని ఎందుకు చేర్చుకున్నాను. సువర్చల జోలికి ఎందుకు పోయాను? చెప్పుదెబ్బల వరకు ఎందుకు తెచ్చుకున్నాను. నేనో ఫూల్‌ని—నేనో ఇడియట్‌ని...

కాలేజీ మైన్ గేటు వచ్చేసింది.

తొమ్మిది దాటింది. రోజూ తొమ్మిదిన్నరకు సువర్చల కాలేజీ గేటులో ప్రవేశిస్తుంది. అసలు ఈ రోజు సువర్చల కాలేజీకి రాకపోతే బావుండును. నిన్న అంత గొడవ జరిగిందికదా? ఇవ్వాళ కాలేజీలో ఏం గోల జరుగుతుందో ఏమోనని సువర్చల కాలేజీకి రాకపోతే బావుండును-అన్న ఆశకల్గటంలో కొంచెం మనస్థిమితం కల్గింది. వేయి దేవుళ్లకు మొక్కుకున్నాను.

సువర్చల ఈ రోజు కాలేజీకి రాకుండా వుండాలని ఏడుకొండలవాడికి కూడా మొక్కుకున్నాను...సువర్చల రాకపోతే గుండు చేయించుకుంటానని. ఇదివరకే ఒకసారి యేడుకొండలవాడకి మొక్కుకున్నాను. మెడిసిన్‌లో సీటు దొరక్కపోతే గుండు చేయించుకుంటానని-ఆ మొక్కు తీర్చలేదు. వెధవ మోజు క్రాపింగ్ మీద. అందుకే ఏడుకొండలవాడు

నన్నీ కష్టాల్లో పడేశాడు. ఏమైనా ఈసారి ఈ గండం గడిచి బయట పడితే తప్పకుండా గుండు చేయించుకొంటాను.

"మన గుంపునుచూసిందంటే అది అక్కడినుండి అటే ఉడాయించేస్తుంది. అదీ గేటుదాటేవరకు అంతా చెట్ల వెనుకకు తప్పుకోండి" అని సలహా యిచ్చాడు రెడ్డి. అంతే - గప్‌చిప్ - అందరమూ కాలేజి ముందున్న పెద్దపెద్ద చెట్ల వెనకాలకు తప్పుకున్నాం.

ఇంకా నాలో అదే ఆశ; సువర్చల ఇవ్వాళ కాలేజీకే రాదు. కాని, ఒకవేళ వస్తే... ఔను ఒకవేళ వస్తే ఊహించలేకపోయాను. సువర్చల ఉగ్రరూపాన్ని నిన్న చూశాక సువర్చల అంటే నాలో యేదో జంకు స్థావరమేర్పరచుకొంది. సువర్చలని సమీపించటం - ఆమె మీద పడి ఆమె పమిట లాగటం- గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. అకస్మాత్తుగా శరీరమంతా మళ్లా చెమటతో నిండిపోయింది. నాలో నిజంగా యింత పిరికితనముందా?

"అదుగో సువర్చల .." అంటూ అరచాడు గోవిందు. ఔను—సువర్చల వచ్చేస్తోంది. నా ఆశలన్నీ చితికిపోయా యనిపించింది. ఒక్కసారి సువర్చలమీద విపరీతమైన అసహ్యం కలిగింది. డేర్‌డెవిల్ ఇవ్వాళ కాలేజీకి రాకపోతే యేం పోయింది. నిన్న అంత జరిగినా సిగ్గు లేకుండా ఎలా వచ్చేస్తోందో! నిజంగా దానికి కొవ్వెక్కింది. దానికి తగిన శాస్తి జరగాల్సిందే.. నిజంగానే అదో బ్లడీ బిచ్. రాస్కెల్—దానికి మూడింది...కాని--కాని నా గుండెలు ఇలా వెర్రిగా వేగంగా కొట్టుకుంటున్నాయి. కాళ్లు భూమిలో పాతుకుపోయా యనిపించింది. గొంతు నిండా ఏదో భయం పూడుకుపోయింది. ఇంతకీ నన్ను ఏడుకొండలవాడు కరుణించలేదు.

సువర్చలతో మరో యిద్దరు అమ్మాయిలు జ్యోతి, రమలు కూడా వస్తున్నారు. వాళ్లు మెయిన్‌గేటు దాటటంతోటే రెడ్డి గట్టిగా విజిల్ వేశాడు. బందిపోటు దొంగల్లా మా వాళ్లు వాళ్ళ వెనకాల పడ్డారు. క్షణంలో మావాళ్ళగోల మిన్ను ముట్టింది. మళ్ళా అవే అరుపులు. కుక్క-- గాడిద, నక్క, కోతి.. నవ్వులు, కేరింతలు. "దొంగ లంజ-కొవ్వెక్కిందిరా దీనికి. దీనిని ఒక్కసారి పదిమంది తాకితేకాని దీని

పొగరు అణగదురా-" ఒకడు ట్విస్ట్ చేస్తున్నాడు. మరోడు బూతుపాట మొదలెట్టాడు. నాకు అంతా అల్లకల్లోలంగా, అయోమయంగా వుంది. ఆ గుంపు మధ్య చలనం లేకుండా రాయిలా నిలబడ్డ నన్ను రెడ్డి గట్టిగా ముందుగా తోశాడు. మరెవడో తోశాడు. ఇంకెవడో తోశాడు. నాశరీరం పూర్తిగా పట్టుదప్పి పోయింది. సువర్చల మీద విరుచుకు పడ్డాను. సువర్చల, నేను ఒకరిమీద ఒకరం పడిపోయాము. మావాళ్ళు దిక్కులు పిక్కటిల్లేలా అరిచారు. భయంతో జ్యోతి, రమలు పారిపోయారు.

క్షణంలో సువర్చల లేచి నిల్చుంది. పడిపోయిన పుస్తకాల్ని యేరుకుంటూ.

'స్కౌండ్రెల్స్ బుద్ధిలేదూ? నిన్న చెప్పుదెబ్బలు తిన్నా యింకా సిగ్గు రాలేదా?' అంది కసిగా—— నేను రెచ్చిపోయాను. ఇంత సేపు జరిగిందంతా నా నిమిత్తం లేకుండానే జరిగిపోయింది. కాని సువర్చల ఆ మాట అనటంతో నాలోని పౌరుషం గుప్పున లేచింది.

"ఔను——సిగ్గులేదే——నాకింకా సిగ్గు వుందనే అనుకుంటున్నావా?" అంటూ సువర్చలమీద పడ్డాను. పమిట లాగాను ఇంకా ఏమేమో చేశాను. సువర్చల నాతో పెనుగులాడింది. నా చెంపమీద చాచి లెంపకాయ వేసింది. నేనూ వేశాను. ఇంతలో మా గోవిందువచ్చి నన్ను వెనక్కులాగాడు. ఇదంతా మావాళ్ళకు వాళ్లు ఊహించిన దానికంటే ఎక్కువ వినోదాన్నే యిచ్చింది. వాళ్ళ కేకలకి, కేరింతలకి అంతులేదు. లోపల కాలేజీ రూమ్స్‌లోవున్న స్టూడెంట్స్, లెక్చరర్స్ అంతా బయటకువచ్చి చూచారు ఈ వినోదాన్ని.

ఏడుస్తూ, నోటికొచ్చినట్లు తిడ్తూ సువర్చల వెళ్ళిపోయింది. అంతా ఏదో కలలో జరిగి పోయినట్లుగా నా నిమిత్తం లేకుండానే క్షణంలో జరిగిపోయింది.

# 12

ఇది జరిగిన ముందురోజే మా కాలేజీలో మరో ముఖ్యమైన సంఘటన జరిగింది. మా పాత ప్రిన్సిపాల్ బదిలీ కావటం, క్రొత్త ప్రిన్సిపాల్

ఛార్జి తీసికోవటం జరిగిందట. కళ్ళనీళ్ల తో, కందగడ్డలాంటిమొహంతో సువ ర్చల ప్రిన్సిపాల్ రూమ్ కెళ్ళినామీద రెడ్డిమీద ఆచారిమీద కంప్లెయింట్ ఇచ్చింది. జరిగిన విషయమంతా చెప్పింది. జ్యోతి, రమల్ని సాక్షులుగావేసి కుంటూ కంప్లయింట్ రాసిచ్చేసింది. వెంటనే మా ముగ్గుర్నీ కాలేజీనుండి సస్పెండు చేస్తూ కొత్త ప్రిన్సిపాల్ నోటీసు పంపాడు. అంతేకాదు, ముగ్గురు లెక్చరర్స్‌తో అసలు జరిగిన విషయం ఏమిటో తెలిసికోడానికి ఎంక్వయిరీ కమిటీ వేస్తున్నట్లు, ఆ కమిటీ విచారణలో సువర్చల తెచ్చిన అభియోగాలు నిజమేనని తేలితే- మా మీద యింకా సీరియస్‌గా యాక్షన్ తీసుకోబడుతుందని కూడా ప్రిన్సిపాల్ నోటీసు పంపించారు.

"అమ్మ బాబోయ్! వీడుకొంచెం స్ట్రిక్ట్‌లాగున్నది." అన్నాడు ఆచారిగాడు.

"పాతోడే నయం, మనం ఏంచేసినా మనజోలికి వచ్చేవాడు కాడు." అన్నాడు గోవిందు.

నాక్కూడా భయమేసింది. వీడేదో చేసేట్టే వున్నాడు. ఇంతకాలం ఈ కాలేజీకి ఒక ప్రిన్సిపాల్ ఉన్నాడని మేము ఎన్నడూ అనుకోలేదు. కాని ఈ కొత్తవాడు మా పని పట్టేటట్టున్నాడు.

కొత్త ప్రిన్సిపాల్ చాలా స్ట్రిక్ట్ అని ఛార్జితీసుకున్న మర్నాడే కాలేజీలోని ముగ్గురు ప్రముఖ రౌడీలమీద యాక్షన్ తీసుకున్నాడని టౌనంతా దావాగ్నిలా వ్యాపించింది. ఇదివరకు పెద్ద రౌడీలుగా ఫోజు పెట్టిన చాలమంది జాగ్రత్తగా మసలుకోవటం గమనించాను.

సస్పెన్షన్ పెద్ద శిక్షేమీకాదు. అసలు మేము క్లాసుకి అటెండ్ అయిందెప్పుడు? అటెండు అయినా క్లాసు పూర్తి అయ్యేదాకా కూర్చున్న దెన్నడు? మమ్మల్ని శిక్షించటానికి ఈ కాలేజీలో ఎవడికీ గుండెలు లేవనుకున్న మా అహానికి ఇది పెద్ద దెబ్బ. మా మీద సస్పెన్షన్ తీసేసే వరకు స్ట్రయిక్ చేదామన్న ఐడియా యిచ్చాడు రెడ్డి. వెంటనే వెళ్ళి మా స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌ను కలసికొన్నాము.

మా యూనియన్ ప్రెసిడెంట్‌కు మేమంటే చాలా గౌరవమూ, భయమూను. అతన్ని ఎలక్షన్లలో గెలిపించడంలో మేము కూడ ప్రముఖ పాత్ర వహించాము.

"ఇవ్వాళ్టి నుండి మామీద సస్పెన్షన్ తీసేసే వరకూ స్ట్రయిక్ అని నోటీసు పంపించు" అన్నాడు రెడ్డి.

"అంత తొందర పడకురా రెడ్డి - మీ మీద సస్పెన్షన్ తీసేయించే భారం నాది. నేను ప్రిన్సిపాల్‌తో మాట్లాడతాను. ఒప్పుకోకపోతే అప్పుడు సమ్మె చేద్దాం." అన్నాడు మా ప్రెసిడెంట్.

"అయితే - యిప్పుడే వెళ్ళి మాట్లాడి తాడోపేడో తేల్చుకొనిరా" అన్నాడు రెడ్డి.

యూనియన్ ప్రెసిడెంట్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వచ్చాడు.

"ఏమైంది?" అని అడిగాడు రెడ్డి.

"వీడు చాలా మొండి ఘటంలాగే కన్పిస్తున్నాడు. ఎంక్వయిరీ పూర్తి అయ్యేవరకు సస్పెన్షన్ వుంటుందట. ఎంక్వయిరీలో నిర్దోషులని తేలితేనే సస్పెన్షన్ తీస్తాడట దోషులని తేలితే యింకా డ్రాస్టిక్ యాక్షన్ తీసికుంటాడట. ఈ విషయంలో మేముకూడా ఆయన కో ఆపరేట్ చేయాలట" అన్నాడు ప్రెసిడెంటు.

"మరి నువ్వేమన్నావు?"-ఆత్రంగా రెడ్డి.

"ఏముంది అనటానికి ఎంక్వయిరీ వరకు వెయిట్ చేయాల్సిందే ఈలోగా ఎంక్వయిరీ కమిటీ మీమీద ఫేవర్‌బుల్‌గా రిపోర్టు పంపించేలా చూసుకోవాలి"-ప్రెసిడెంటు.

"అరే నారిగా—నువ్వు ప్రెసిడెంటువి కాగానే మారిపోయావురా, ఇకవీళ్ళ అవసరం యేముందనుకుంటున్నావేమో - వెంటనే స్ట్రయిక్ చెయ్యకపోతే నిన్ను, నీ ప్రెసిడెంట్ గిరిని ఉతికి అవతల పారేస్తాను, జాగ్రత్త"- ఉరిమాడు రెడ్డి.

"ఎందుకురా, అంతతొందర పడ్తావు, స్ట్రయిక్ చేద్దాం. కాని ఇప్పుడే చేస్తే అటు ఎంక్వయిరీ కమిటీ వాళ్ళకు, ఇటు ప్రిన్స్‌పాల్‌కు మన మీద సింపతీ పోతుంది. ఎంక్వైరీ కమిటీ మెంబర్స్‌ని కలిసికొని మీ మీద ఫేవరబుల్ రిపోర్టు వెళ్ళేలా, చూసే భారం నాది"-అన్నాడు ప్రెసిడెంట్.

"ఎవర్రా—ఎంక్వయిరీ కమిటీ మెంబర్స్?"-నేను.

"ఎకనామిక్స్ లెక్చరర్ ఒకాయన, లెక్కల మాస్టారు రెండో ఆయన. మూడోవారు ఇంగ్లీషు లెక్చరర్."

ఇది విన్న తర్వాత ఎంక్వయిరీ కమిటీ ఫేవరబుల్ రిపోర్టు మా మీద పంపిస్తున్నదన్న నాఆశ పూర్తిగా అడుగంటి పోయింది. ఎకనామిక్స్ లెక్చరర్‌ని మేము చాలాసార్లు ఏడ్పించాము. చంపుతామని బెదిరించినా అతడు మా పట్ల ఫేవరబుల్‌గా రాయడు. ఇంగ్లీషు లెక్చరర్‌ని కూడా ఏడిపించాము. ఇక లెక్కల లెక్చరర్‌తో మాకు సంబంధమేలేదు.

ఈ కమిటీ మా పట్ల ఫేవరబుల్‌గా రాయడం ఇంపాజిబుల్ అన్నాను నేను.

"ఇంపాజిబుల్ ఏం కాదు నేనువెళ్ళి వాళ్ళను కలుస్తాను. మీమీద డ్రాస్టిక్ యాక్షన్ అంటూ తీసుకోవడం జరిగితే అది ఈ కాలేజికి చాల ప్రమాదమనీ, స్ట్రయిక్ చేయటం—కాలేజి మూతపడటం నానా డిస్ట్రిక్షన్ జరగటం మొదలైనవన్నీ జరుగుతాయని చెబుతాను. తప్పకుండా వాళ్ళ చేత ఫేవరబుల్‌గా రాయిస్తాను. డోంట్‌వర్రీ" అంటూ మమ్మల్ని ఒప్పించాడు మా యూనియన్ ప్రెసిడెంటు.

ఎంక్వైరీ కమిటి రిపోర్టుకోసం ఎదురుచూడటం తప్ప చేసేదేమీ కన్పించలేదు. ఆ కమిటీ రిపోర్టు ఇవ్వటానికి వారంరోజులయినా పట్టింది. ఈ వారం రోజుల్లో మా యూనియన్ ప్రెసిడెంటు నాకు కన్పించనే లేదు. మరో చిత్రం ఏమిటంటే ఈ వారం రోజుల్లో ఆచారి, రెడ్డికూడా నన్ను కలిసి కోలేదు. ఒకసారి బజార్లో కన్పించినా చాల ముభావంగా వున్నారు. ఒక రోజు గోవిందు చెప్పాడు.

"రెడ్డి, ఆచారి—నీ కారణంగా వాళ్ళ పేర్లు సస్పెన్షన్ లిస్టులో ఎక్కాయనీ, తమకు ఆ రోజు సువర్చలమీద జరిగిన ఆ రౌడీ చర్యకు ఏమీ సంబంధం లేదని ఎంక్వయిరీ కమిటీతో చెప్పుకున్నారట. యూనియన్ ప్రెసిడెంట్ వాళ్ళకు అలా ఎంక్వయిరీ కమిటీ వాళ్ళతో చెప్పమని సలహా యిచ్చాడట. ఏమైనా వాళ్లు నీకేదో మోసం తలపెట్టారు. శిక్షంటూ పడ్తే నీకు ఒక్కడికే పడ్తుందట. కాలేజీలో అంతా అనుకుంటున్నారు-" అని.

నా వళ్లు మండిపోయింది. అసలు వాళ్ళకారణంగానే నేను సువర్చల జోలికిపోయాను రాస్కెల్స్! నన్ను ముందుకు తోసి ఎంత

నాటకమాడారు ! ప్రెసిడెంటుగాడుకూడా వాళ్ళతో ఎంత నాటక మాడిం చాడు ! అందరిలో నేనే యాస్నై పోయాను.

ఎంక్వయిరీ కమిటీ రిపోర్టు సబ్మిట్ చేసింది. "రెడ్డికి, ఆచారికి ప్రత్యక్షంగా ఆనాడు జరిగిన సంఘటనతో సంబంధం లేదని, సురేందర్ మాత్రం కాలేజి ఆవరణలో సువర్చలను చాల అనాగరికంగా అవమా నించా"డని ఆ రిపోర్టు సారాంశం.

వెంటనే ప్రిన్సిపాల్ యాక్షన్ తీసికున్నాడు. రెడ్డిని ఆచారిని పది రూపాయల ఫైన్‌తో వదిలేశాడు. నన్నుమాత్రం రెండేళ్ళు ఇండియాలోని ఏ కాలేజీలోనైనా సరే చేర్చుకోకుండా రస్టికేట్ చేశాడు.

## 13

నన్ను రస్టికేట్ చేస్తున్నట్లు జారీ అయిన నోటీసు చూడగానే నా కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. నావెనుక ఈ కాలేజీలోని వేయిమంది స్టూడెంట్స్ వున్నారనుకున్నాను. నన్ను రస్టికేట్ చేస్తే ఆ వేయిమంది నా కోసం ఎంత త్యాగాన్నయినా చేస్తారనుకున్నాను. ఈ కాలేజీని నిలువునా భస్మం చేస్తారనుకున్నాను. కాని ఇప్పుడు ఒక్కడైనా— ఒక్కడైనా నాపట్ల సానుభూతి చూపకపోవటం నన్ను పిచ్చివాణ్ణి చేసింది. రెడ్డి, ఆచారి — రెడ్డి, ఆచారి జ్ఞాపకం రాగానే నా హృదయం భగ్గున మండిపోయింది. నన్ను సువర్చల మీదకు ఉసిగొల్పారు. తర్వాత ఎంతో తెలివిగా తప్పుకున్నారు. కన్నీళ్ళను ఆపుకుంటూ బరువెక్కిన గుండెలతో యిల్లు చేరాను. జరిగిన సంఘటనలన్నీ కళ్ళముందు గిర్రున తిరుగసాగాయి. అన్నీ ఎంత వేగంగా జరిగిపోయాయి. అన్నీ నా నిమిత్తం లేకుండానే, ఏదో మాయలాగ ఏదో నాటకంలాగ కళ్లు తెరచి చూసేలోగా అంతా అయిపోయింది. అంతా అయిపోయింది.

రెండేళ్లు రస్టికేషన్ — కాలేజీలో చేరడానికి వీలేదు. నో మోర్ ఎ కాలేజ్ స్టూడెంట్ — ఈ ఏడెనిమిది నెలల్లో కాలేజీ జీవితంలోని

హాయిని, ఆనందాన్ని అనుభవించాను, ఇంత త్వరగా ఆ హాయిని, ఆ ఆనందాన్ని పోగొట్టుకుంటానని కలలోనైనా ఊహించానా ?

నో మోర్ ఎ కాలేజీ స్టూడెంట్ – అంటే – నా చుట్టూ ఎప్పుడూ నన్ను ఇంద్రుడవు, చంద్రుడవు అంటూ పొగిడే ఓ గుంపు యిక వుండదు. నన్ను చూచి లెక్చరర్స్ భయపడటం వుండదు. కాలేజీ వరండాలో టకటకా నడచుకుంటూ దేవానంద్‌లా ఫోజులు కొట్టటం వుండదు. టౌన్‌లో యెక్కడకు వెళ్ళినా, యే హోటల్ కెళ్ళినా నన్ను చూచి వినయంతో కుర్చీ చూపించడం వుండదు.

వచ్చే సంవత్సరం యూనియన్ ప్రెసిడెంట్‌గా పోటీచేసి గెలుపొందాలని కలలు కన్నాను. తప్పకుండా గెలుస్తానని నా భుజం తట్టిన వాళ్ళంతా యేరిప్పుడు ? అంతా అయిపోయింది నా కలలన్నీ కరగిపోయాయి. ఆశలన్నీ ఆరిపోయాయి. నేను ఒంటరిగాడినై పోయాను. బాధ-బలమైన సుత్తెతో నా హృదయాన్ని ఎవరో బాదుతున్నారు. మెత్తని కత్తితో నా నన్నెవరో ముక్కలు ముక్కలుగా కోసివేస్తున్నారు. కసి– నామీద నాకుకసి? నన్ను నేను విధ్వంసం చేసికోవాలనే కసి.వరిగడ్డిమంటలా గుప్పున పైకిలేచి నన్ను నిలువునా కాల్చివేస్తున్న కసి—నేనంతా కసి—

"సురేందర్—ఉన్నావా?" అంటూ నా రూంలోకి దూసుకు వచ్చాడు మా యూనియన్ జనరల్ సెక్రటరీ శేఖర్. మా రూమ్‌కు రావటం నన్ను షాక్ చేసింది. ఎందుకంటే శేఖర్‌కు నాకు బద్ధవైరం. ఎలక్షన్స్‌లో అతనికి వ్యతిరేకంగా ప్రచారం చేశాం మేమంతా.

శేఖర్ నన్ను ఊపిరి పీల్చుకోనీయకుండా చకచకా చెప్పుకుపోయాడు—

"నీకు చాల అన్యాయం జరిగిపోయింది సురేన్. ప్రెసిడెంట్, రెడ్డి, ఆచారి నీమీద బ్రహ్మాండమైన కుట్రపన్నారు. నీ కళ్ళల్లో కారం జల్లారు. నువ్వు మెదలకుండా వూరుకుంటావా? నో—నోనో—, కమాన్ ... నీ రస్టికేషన్ రద్దయ్యేవరకు సమ్మె — రేపటి నుంచే స్ట్రయిక్, మేమంతా నీతో వుంటాం — ఇంకో విషయం యేమిటో తెలుసా? మన కొత్త ప్రిన్సిపాల్ ఆంధ్రావాడు. 'ప్రిన్సిపాల్ డౌన్

డౌన్ ఆంధ్రా గో బ్యాక్' అనే స్లోగన్స్ మొదలెడదాం. ఈ దెబ్బతో ప్రిన్సిపాల్‌గాడు ట్రాన్స్‌ఫర్—నీ రస్టికేషన్ రద్దు. అంతవరకు నిద్ర పోయేది లేదు. కమాన్—గెటప్—మన ఫ్రెండ్స్ అందరితోను ఈ విషయం చెబుదాం పద."

నేను ఆలోచించుకోటానికి టైమివ్వలేదు శేఖర్. ఐనా ఆలోచించే శక్తి కూడా నా కప్పుడు లేదు. నా సర్వస్వమూ అతడే నన్నట్లుగా అతణ్ణి అనుసరించాను. శేఖర్ నన్ను యెక్కడెక్కడికో తీసికొనిపోయాడు, ఎవరెవ్వరో కలసికొన్నాం. వాళ్ళంతా యిదివరకు నాకు పరమ శత్రువులు. ఇప్పుడు మిత్రుల మంటున్నారు. పూర్వపు మిత్రులంతా శత్రువు లయ్యారు. అంతా ఏదో మాయ, ఏదో నాటకం. నా నిమిత్తం లేకుండానే నే నా మాయలో, ఆ నాటకంలో పడిపోతున్నాను. జరుగుతున్న దాన్ని ఆపే శక్తి నాలో లేదనిపించింది.

శేఖర్ తన గ్రూపువాళ్ళందరికీ ప్రెసిడెంట్ నన్ను ఎలా పట్టేట్లో ముంచాడో చెప్పాడు. (అసలు సంగతేమిటంటే మా ప్రెసిడెంట్‌కు, జనరల్ సెక్రటరీ శేఖర్‌కు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటుంది.) నాకు జరిగిన అన్యాయం గురించి నొక్కి వక్కాణించాడు. సువర్చల మొదట నన్ను యింటికి పిలిచి అవమానిస్తే నేను ఆమెను కాలేజీలో అవమానించానన్నాడు. రెంటికీ చెల్లు. అటువంటప్పుడు సువర్చలకు శిక్ష పడకుండా నాకే శిక్షపడటం చాల ఘోరమైన అన్యాయ మన్నాడు. అసలు దీనికంతటికి కారణం మా క్రొత్త ప్రిన్సిపాల్ ఆంధ్రా వాడు కావడమే అన్నాడు. అసలు సువర్చల ఒక ఆంధ్రా ఆఫీసరు కూతురు. అని కొత్త వివరాలు బయటపెట్టాడు. మా యూనియన్ ప్రెసిడెంట్ ఆంధ్రావానికి ఆడదానిలా లొంగిపోయాడన్నాడు. రేపట్నించి స్ట్రయిక్—నా రస్టికేషన్ రద్దయ్యేవరకు—ప్రిన్సిపాల్ ట్రాన్స్‌ఫర్ అయ్యే వరకు నిద్రపోకూడదు అన్నాడు.

అంతా నా భుజం తట్టారు. ఏం ఫర్వాలేదన్నారు. మళ్లా నాకు వేయి ఏనుగుల బలం వచ్చింది. నాలో మాయమైపోయిన ఆత్మవిశ్వాసం తిరిగి స్థిరపడింది.

# 14

తెల్లవారింది. ఇవ్వాళ కాలేజిస్టూడెంట్స్ సమ్మెచేస్తారన్న వార్త టౌనంతా వ్యాపించింది. అంతా ఎవరి జాగ్రత్తలో వాళ్లున్నారు. శేఖర్ గ్రూపువాళ్ళు ఓ 50,60మంది కాలేజీ గేటుముందు నిల్చొని ఎవర్నీ లోపలికి వెళ్ళనివ్వటంలేదు. త్వరలోనే మూడు నాలుగువందలమంది పోగయ్యారు. యూనియన్ ప్రెసిడెంట్ ప్రిన్సిపాల్‌కు లొంగిపోయి ఒక విద్యార్థికి ఎంత అన్యాయం చేశాడో అందరికి చెప్పాడు శేఖర్. వెంటనే 'ప్రిన్సిపాల్ డౌన్ డౌన్—ఆంధ్రా గో బ్యాక్', అనే నినాదాలతో గోల ప్రారంభమైంది. ఇంతలో మా ప్రిన్సిపాల్ వచ్చాడు. శేఖర్‌తో యేదో మాట్లాడబోయాము, కాని మరల స్లోగన్స్ మిన్ను ముట్టడంతో ఆయన వెళ్ళి తన రూమ్‌లో కూర్చున్నాడు. టౌన్‌లో ప్రొసెషన్ తీస్తే బావుంటుందని సలహా యిచ్చారు శేఖర్‌కు ఎవరో—వెంటనే రెండు మూడు వందల మందిమి ఊరేగింపు ప్రారంభించాం. "ప్రిన్సిపాల్ డౌన్ డౌన్—ఆంధ్రా గో బ్యాక్" యివే మా స్లోగన్స్. త్వరలోనే ఒక పోలీస్ వ్యాన్ మమ్మల్ని వెంటాడటం ప్రారంభించింది. పోలీసుల్ని చూడగానే మావాళ్లు "పోలీస్ డౌన్ డౌన్" అనటం మొదలెట్టారు. ఇంతలో రోడ్డుప్రక్కన కంకరరాళ్ల రాసులు కన్పించాయి. మా వాళ్ళల్లో ఎవడో ఒకడు ఒక రాయి తీసి ఎలక్ట్రిక్ దీపానికి కొట్టాడు. అంతే అందరూ తలా ఒకరాయి తీసుకున్నారు. ఫట్. ఫట్ ఫాట్ మని బల్బులు బద్దలై పోయాయి. ఇంతలో అక్కడి కొక ఆర్. టి. సి. బస్సువచ్చింది. మావాళ్ళ కంకరరాళ్ళ వర్షం ఆ బస్సుపై కురిసింది. క్షణంతో బస్సుల అద్దాలు పగిలిపోయాయి. బస్సులోని యిద్దరు ముగ్గురుకి మొహాలు పగిలిపోయాయి. ఇంతలో పోలీసులు లాఠీలతో మా మీద పడ్డారు. మా వాళ్ళ రాళ్ల పోలీసులమీద కురవటం మొదలైంది. ఆ తర్వాత యేం జరుగుతున్నదో తెలియలేదు. పోలీసుల కేకలు-డాం డామ్మని టియర్‌గ్యాస్ షెల్స్ పగిలిన చప్పుడు-మేమంతా ఒకరిమీద ఒకరం పడి పరుగెత్తసాగాం. మా వెనుక లాఠీలతో పోలీసులు. ఓ లాఠీ నా మీద

పడనే పడింది. కొంత దూరం పరుగెత్తాక పోలీసులు నన్నూ మరి కొంత మందిని పట్టుకున్నారు. జైలుకి పట్టుకుపోయారు. ఆ రోజు - ఆరాత్రి జైల్లోనే వుంచారు.

నేను అరెస్టు అయిన సంగతి, మా నాన్నకు తెలియగానే పరుగెత్తుకొని వచ్చి నన్ను విడిపించాడు. నా రస్టికేషన్ రద్దు చేయించే ప్రయత్నాలు కూడా చేశాడు. కాని మా ప్రిన్సిపాల్ మహామొండి ఘటం. మా నాన్న ఆటలు సాగనివ్వలేదు. త్వరలోనే వీడిని ఈ ఊరునుండి బదిలీ చేయించేస్తానని నాన్న ప్రతిజ్ఞ చేశాడు.

"అడ్డగాడిద—ఏపని చేసినా, తల మీదకు తెచ్చుకునే పని చేయ గూడదని తెలియదా! నా కడుపున చెడబుట్టావురా!" అంటూ నన్ను నాన్న బూతులు తిట్టాడు.

మేము సమ్మె చేసినరోజే పదిహేను రోజుల వరకు కాలేజీ మూసివేస్తున్నట్లు మాప్రిన్సిపాల్ ప్రకటించాడు. శేఖర్, శేఖర్ గ్రూపు వాళ్లు, అంతా ఎక్కడి వాళ్లక్కడే మాయమైపోయారు. నా కెవ్వరూ కనిపించలేదు.

రెండేళ్లవరకు నా కాలేజి జీవితం ఆగిపోయినట్లేనన్న సత్యాన్ని అంగీకరించక తప్పలేదు. అయినా ఈ రెండేళ్ళు నా కాలేజి లైఫ్ ఆగిపోపటం ఒక రకంగా మంచిదే ననిపించింది. ఎందుకంటే ఇలా జరగడం వల్ల మరో రెండేళ్ళు కాలేజీ లైఫ్ అదనంగా నాకు లభించిందన్న మాట. పూర్వం ఎవరో ఏదొచ్చినా మన మేలుకే అన్నాడట— ఎంత బాగా అన్నాడో! ఈసారి కాలేజీలో జాగ్రత్తగా వుంటాను. మా నాన్న అన్నట్లు ఏంచేసినా నా తల మీదకు తెచ్చుకునేలా చేయను. రెడ్డి, ఆచార్ల లాగ యేంచేసినా యింకొకడి తలమీదకు వచ్చేలా చేస్తాను. అంతే—